

ప్రజాశక్తి

శనివారం 23 ఆగస్టు 2025 | 8 పేజీలు





బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యాలపై టీటీడీ ఈవో సమీక్ష



సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న టిటిడి ఈవో శ్యామలరావు

ప్రజాశక్తి- తిరుమల

బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు వసతి, ఇతర సౌకర్యాలకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా తిరుమలలోని అన్ని గదులలో ఎలక్ట్రిక్ పనులు, మరుగుదొడ్లు, ఇతర రిపేర్లను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శుక్రవారం అధికారులతో బ్రహ్మోత్సవాల్లో భక్తుల వసతి, ఇతర సౌకర్యాలపై ఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలోని పలు విశ్రాంతి గృహాలు, కాటేజీల మరమ్మతు పనులను రిసెప్షన్ విభాగంతో సమన్వయం చేసుకుని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యాత్రికుల వసతి సముదాయాల్లో కూడా సెంట్రలైజ్డ్ బుకింగ్ సిస్టమ్ అప్లికేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులు వేచి ఉండే సమయం ఎక్కువగా ఉన్నందున వేరొక ప్రాంతంలో కూడా అన్న ప్రసాద భవనం ఏర్పాటు చేసేందుకు పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర ఆహార భద్రతా అధికారులతో తిరుమలలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. అదేవిధంగా పంచాయతీ, రెవెన్యూ విభాగం ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఏర్పాటు చేసిన ధరల పట్టికను పరిశీలించాలని ఆదేశించారు. తిరుమలలోని హోటళ్లలో భక్తులకు సాంప్రదాయ భోజనం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. భక్తులు లడ్డూ ప్రసాదం తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తకుండా లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రంలోని అన్ని కౌంటర్లు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫీడ్ బ్యాక్ సర్వే ద్వారా వచ్చే భక్తుల అభిప్రాయాలను, సలహాలు, సూచనలను తీసుకుని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీఈ సత్య నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గళం 'ప్రజాశక్తి'

(వార్త 4వ పేజీలో..)



విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే రాజీనామా చేయండి..

పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలి

ఎస్వీ యూనివర్సిటీ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

(వార్త మెయిన్‌లో..)

నారాయణస్వామి ఇంట్లో సిట్ విచారణ



(వార్త మెయిన్‌లో..)



లేబర్ కమిషనర్ ఏవో ఇంటిలో ఏసీబీ సోదాలు

(వార్త మెయిన్‌లో..)

తప్పు చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదు: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రమాణస్వీకారం చేస్తున్న పుంగనూరు ఏఎంసి పాలకవర్గం సభ్యులు



సోమలలో ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్



ప్రజాశక్తి పుంగనూరు, సోమల

అధికారం ఉన్నది కదా అని పెత్తందారీ పోకడ, అహంకారాన్ని శుక్రవారం పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జైలుపాలు కావడానికి ఇది ఒక నిదర్శనమని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఆగస్టు 4న అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా అంగళ్లు, పుంగనూరు ప్రాంతంలో వైసిపి వాళు అల్లర్లు సృష్టించి తెలుగుదేశం నేతలు పైన కేసులు పెట్టి జైలుకు పంపడం జరిగిందని, అదే రెండేళ్ల తర్వాత ఇప్పుడు వారు జైలుకు వెళ్లడం జరిగిందని ఇది వారి అహంకారానికి నిదర్శనమని అన్నారు. మహిళల ఆశీర్వాదం వల్లే 164 స్థానాలు గెలుచుకున్నామని అన్నారు. మహిళల రుణం తీర్చుకునే సమయం వచ్చింది కాబట్టే ఉచిత బస్సు ప్రయాణం పథకం తీసుకొచ్చామని, ఎనిమిది రోజుల్లోనే 80లక్షల మంది మహిళలు ఫ్రీ బస్సుల్లో ప్రయాణం చేశారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రరెడ్డి, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి పసుపులేటి హరిప్రసాద్, రూరల్ అధ్యక్షుడు మాధవరెడ్డి, సివి.రెడ్డి పాల్గొన్నారు.

ఏఎంసి పాలకవర్గం ప్రమాణస్వీకారం

పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో శుక్రవారం జరిగింది. నూతన ఛైర్మన్‌గా సమీపతి యాదవ్, వైస్ ఛైర్మన్ వెంకటరమణ, పాలకవర్గ సభ్యులుగా 13మంది ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ పసుపులేటి గోపి నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముందు స్థానిక ఇందిరా సర్కిల్ నుంచి ర్యాలీగా, బాణసంచా కాల్చుతూ, భారీ క్రేన్లతో పూలహారంతో నాయకులకు మంత్రికి స్వాగతం పలికారు.

సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన కరణం శ్రీనివాసులు నాయుడు, వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా ఎన్నికైన శివశంకర్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఛైర్మన్‌ల వద్ద కమిటీ మెంబర్ల వద్ద మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో 175 నియోజకవర్గాలలో ఎక్కడా లేనివిధంగా పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి టిడిపి నాయకులను కార్యకర్తలను రైతులను రాచిరంపాన పెట్టారని రాక్షస రాజ్యం నడిచిందని, ఎంతోమంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి కొందరు స్వగ్రామాల నుండి పారిపోయే విధంగా అరాచకాలు చేయబట్టే నేడు ఆయన కుమారుడు జైలు ఊచలు లెక్కబెడుతున్నాడని అన్నారు. మండలంలోని ఆవులపల్లె ప్రాజెక్టు నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు ముఖ్యమంత్రితో చెప్పి న్యాయం జరిగే విధంగా చూస్తామని అధైర్య పడవద్దు అని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, రమేష్ నాయుడు, ఆస్టాఫ్, సతీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణబాబుకు డాక్టర్ సర్వేపల్లి అవార్డు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అత్యుత్తమ డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జాతీయ అవార్డు పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు అందుకున్నారు. 21వ శతాబ్దంలో విద్యావ్యవస్థలో అభ్యాసకులను శక్తివంతం చేయడం, దేశంలో విద్యా పరిశ్రమల్లో విద్యా అభివృద్ధి, అవసరాలను, సలహాలు కోసం కృషి చేసిన వాళ్లకు ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రతిష్టాత్మక అవార్డుకు పిఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణబాబు ఎన్నిక కావడం జరిగింది. శుక్రవారం హైదరాబాదులో కార్యక్రమంలో ఆయన అవార్డును స్వీకరించారు. అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా ఆపాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని చేసిన వారు, చేయించుకున్న వారు, ప్రోత్సహించిన వారు చట్ట ప్రకారం శిక్షార్హులు అని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో చిత్తూరు డివిజనల్ అధికారి అధ్యక్షతన లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఆర్డీవో మాట్లాడుతూ జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తిని మెరుగుపరచడానికి పిసిపిఎన్డిటి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని శాఖల వారు సహాయ సహకారాలను అందించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టం, భేటీ బచావో బేటి పడావో, సేవ్ ద గర్ల్ చైల్డ్ మొదలగు కార్యక్రమాలపై వైద్యాధికారులతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. లింగ నిర్ధారణ చేసే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను కనిపెట్టేందుకు చేపట్టే డెకాయ్ ఆపరేషన్లు నిర్వహణకు పోలీస్ శాఖ సహాయసహకారాలు అందించాలన్నారు. డిఎల్ఎస్ఏ జడ్జి భారతి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, కళలు, సాంకేతిక రంగాల్లో రాణించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, మిషన్ కోఆర్డినేటర్ నిర్మల, డిసిపిఓ సుబ్రహ్మణ్యం, డివిజన్ పరిధిలోని సిడిపివోలోలు, సూపర్‌వైజర్లు, పంచాయతీ సెక్రెటరీ, గ్రామవార్డు సచివాలయాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్స్ సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఉద్యోగం ఇచ్చేవారిగా ఎదగాలి..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతి ఒక్కరూ ఉద్యోగం ఇచ్చేవారుగా ఎదగాలని విజయం విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఏం.తేజోమూర్తి అన్నారు. శుక్రవారం మై భారత్ చిత్తూరు ఆధ్వర్యంలో విజయం బిజినెస్ స్కూల్ ప్రాంగణంలో స్టార్ట్ అప్ ఇండియా మీద ఒకరోజు కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పెట్టుబడి అవకాశాలను ప్రారంభించాయని తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా వ్యాపార అవకాశాలను ప్రభుత్వం తరపున అందజేసే రాయితీలను గురించి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సి.సూరిబాబు విద్యార్థులకు పరిశ్రమలకు సంబంధించి చిత్తూరు జిల్లాలో ఉన్న అవకాశాల గురించి వివరించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ బ్యాంకుల రాయితీలు, పూచి కత్తులేని రుణాలు ఏవిధంగా పొందవచ్చునేది వివరించారు. విద్యార్థులకు ఇంక్యువేషన్స్ సెంటర్స్, ఇన్వెస్టర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ స్థాపనకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. వ్యాపారం మొదలుపెట్టే ముందు ఎటువంటి జాగ్రత్తలు, మార్గదర్శకాలు పాటించాలో విజయం బిజినెస్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయంత్ తెలిపారు. కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులకు జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్ ధ్రువపత్రాలను అందజేశారు. ప్రాంతీయ గణాంకాధికారి ఎంసీ.బాబు రెడ్డి, రాజకుమారి, నిత్యానందం, కె.హరీష్ బాబు పాల్గొన్నారు.

అపర భగీరథుడు సీఎం చంద్రబాబు: ఎంపి దగ్గుమళ్ల



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాయలసీమ ప్రాంతంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపర భగీరథుడిలా అహర్నిశలు శ్రమిస్తున్నారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. కుప్పం నియోజకవర్గాన్ని హంద్రీ-నీవా జలాలతో సస్యశ్యామలం చేయడమే తన సంకల్పంగా భావించి, ముందుకు సాగుతుండడం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరై దేశరాజధాని ఢిల్లీలో ఉన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో మాట్లాడారు. ఈనెల 30న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో కృష్ణాజలాలకు హారతి పట్టనున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు కృషిని కొనియాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు పార్లమెంటు పరిధిలోని కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు చేరుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో
రూ.1.16 లక్షల జరిమానా

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మద్యం తాగి వాహనాలు నడపడం, బహిరంగ మద్యం తాగిన కేసులో 26 మంది పట్టుబడగా వారిని పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. వారిని విచారించిన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జానకి మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి రూ.10వేలు చొప్పున పది మందికి రూ.లక్ష జరిమానా విధించారు. బహిరగంగా మద్యం తాగిన కేసులో 16 మంది పట్టుబడగా ఒకరికి రూ. 1000 చొప్పున రూ. 16వేలు జరిమానా విధించారు. మొత్తం 26 కేసుల్లో రూ.1.16 లక్షల జరిమానా విధించినట్లు సీఐ విక్రమ్ తెలిపారు.

అర్హులైన వికలాంగులకు పింఛన్లు రద్దు చేయడం దారుణం

సిపిఎం జిల్లా కన్వీర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో వికలాంగుల పింఛన్లు వడపోత పేరుతో అర్హులైన వికలాంగుల పెన్షన్లు తొలగించడం దారుణమని వెంటనే పునరుద్ధించాలని సిపిఎం జిల్లా కన్వీర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తప్పిదం చేసిందని నేడు కూటమి ప్రభుత్వం వడపోత పేరుతో అర్హులైన వారికి జిల్లాలో దాదాపు 3వేల మంది పించన్లు రద్దు చేయడం దారుణమన్నారు. ఏదైనా తప్పు జరిగింటే తప్పు చేసిన వారి పైన చర్యలు తీసుకోవాలే తప్ప ఆ పేరుతో నిజమైన వారిని తొలగించడం, పుట్టుకతోనే వికలాంగులైన వారికి కూడా సర్టిఫికెట్స్ మారిపోతాయని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన సర్టిఫికెట్స్ ప్రస్తుత డాక్టర్లు పుట్టుకతో వచ్చిన వికలాంగులకు కూడా ఎలా మార్పు చేస్తారని ధ్వజమెత్తారు. అలాంటి అధికారులపై చర్యలు తీసుకోకుండా వేలాది మంది వికలాంగులకు పింఛన్లు రద్దు చేయడం ఇది ఉద్దేశపూర్వకంగానే చేశారని విమర్శలకు దారితీస్తున్నదని, మూడు రోజులు ముందు వికలాంగులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ బయట వచ్చేంతవరకు నిరసన చేశారంటే సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు ఇచ్చారని దురుద్దేశంతో ప్రస్తుత ప్రభుత్వం అర్హులను తొలగించడం సిగ్గుచేటు అన్నారు. రాజకీయాలు పక్కనపెట్టి సంక్షేమ పథకాల అమలు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని, ఇప్పటికైనా అర్హులైన తొలగించిన వారికి వెంటనే పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని లేనిపక్షంలో వారికి మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఆరోగ్య పరీక్షా శిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి- విజయపురం (నగరి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించిన ఆరోగ్య పరీక్షా శిబిరానికి విశేష స్పందన లభించింది. తమ ప్రయోగశాలలలో నేర్చుకున్న పద్ధతులను ఉపయోగించి, హీమోగ్లోబిన్ అంచనా, రక్త గ్రూపు నిర్ధారణ, రక్తపోటు, నాడి మాపన, బాడీ మాస్ ఇండెక్స్ తదితర ముఖ్యమైన ఆరోగ్య పరీక్షలను రూ.10ల నామమాత్రపు చెల్లింపుతో అందించారు. విద్యార్థులు పలువురు ఈ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వహించిన విద్యార్థులు మాట్లాడుతూ 'పుస్తకాల్లో నేర్చుకున్నది నిజ జీవితంలో ఎలా పనిచేస్తుందో చూడడం, దాన్ని అమలు చేయడంతో తమకు ఎంతో అనుభవాన్ని ఇస్తుందన్నారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువత, తమ ఆరోగ్య స్థితిని తెలుసుకోవడంపై ఆశక్తి కనబరచడం లేదని కళాశాలలోనే పరీక్షలు నిర్వహించడం వారికెంతో ఉపయోగపడిందని అన్నారు. జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సమన్వయకర్త డాక్టర్ స్వాతి, అధ్యాపకులు అరుణకుమారి, సుహాసిని, గిరిషా. రేవతి, పంకజ,నవీన్, రమేష్, లాల్‌భాషా పాల్గొన్నారు.

కుప్పం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ భూసేకరణపై గ్రామసభ

ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని దండికుప్పం, 30 సొన్నేగానిపల్లి, అమ్మవారిపేట, వెంకటేష్ పురం గ్రామాలలో కుప్పం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ అభివృద్ధి కోసం భూమి సేకరణలో భాగంగా న్యాయమైన భూసేకరణ, నష్టపరిహారం, పునరావాసం, ఉపాధి కల్పన చట్టం 2013 సెక్షన్ 11 (1) కింద జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయబడింది. ఈ విషయం గురించి ప్రజలకు సమాచారం అందించడానికి శుక్రవారం ఆర్డీవో శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామసభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు దండికుప్పం, 30 సొన్నేగానిపల్లి, అమ్మవారిపేట రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతుల వారి భూమి వివరాలను సరి చూసుకోవాలని ఏదైనా సర్వే నెంబర్లు, విస్తీర్ణం సంబంధించి వివరాలను తప్పులుంటే రెవెన్యూ అధికారులకు తెలిపి సరిచేసుకోవాలన్నారు. ఆర్డీవో శ్రీనివాసులు, తహశీల్దార్ శివయ్య, ఎస్సై నరేష్, రెవెన్యూ సిబ్బంది చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు.



ప్రజాశక్తి
శనివారం 23 ఆగస్టు 2025



క్షయ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - రొంపిచర్ల : రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ క్షయ నిర్మూలన పై శుక్రవారం అవగాహన కల్పించారు. గానుగ చింత సచి వాలయంలోని కల్లావారిపల్లిలో 104 పాయింట్‌లో వారు మాట్లాడుతూ 60 ఏళ్ల పైబడిన వారు, షుగర్, బిపి, కేన్సర్, గుండెపోటు, పక్షవాతం, బియంఐ 18 శాతం కన్నా తక్కువగా ఉన్నవారు, ఇటుక బట్టీలలో, క్వారీలలో పనిచేసే వారు, ధూమపానం, మద్యపానం చేసేవారు , హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధులతో మందులు తీసు కుంటున్న వారు టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి టిబి సూపరువైజర్, ఎంఎల్‌హెచ్‌పి శ్రీలత, ఏ ఎన్ఎం మమత, మునీశ్వరి, సుబ్బరత్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వికలాంగులకు పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వికలాంగులకు అండ

వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్ల పంపిణీలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పలమనేరు: ప్రత్యేక ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పలమనేరు ఎమ్మెల్యే అమర నాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సుమారు 71.31 లక్షల విలువచేసే 1078 (ట్రై సైకిల్లు, వినికిడి యంత్రాలు , వీల్ చైర్లు, వాకింగ్ స్టిక్స్ తదితర) పరికరాలను ఆయన చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ పరికరాలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్‌డీవో భవాని, దివ్యాంగుల సంక్షేమ సంఘం సహాయక సంచాలకులు వినోద్, మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి, నాయకులు కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు, ఖాజా, మదన్, కిరణ్, బిఆర్‌సి కుమార్, జనసేన నాయకులు దిలీప్, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం

ప్రజాశక్తి -గుడిపల్లి: ప్రపంచ జానపద దినోత్సవం జానపద, గిరిజన ప్రకాశాల విభాగం ఆధ్వర్యంలో ఎండోమెంట్ లెక్చరర్ ఎమినో హౌస్ ఆచార్య బి రామరాజు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెంగాలీలోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రిన్సిపాల్ అమ్మెల్ షెరాన్, ద్రావిడ విశ్వవిద్యాలయ డీన్ ఎకడమిక్ అఫైర్స్, ఫోక్లోర్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె శ్యామల అతిథులను ఆహ్వానించారు. బి రామరాజ్, గ్రీట్ ప్రిఫ్‌ను రిజిస్ట్రారు ఆచార్య వి కిరణ్‌కుమార్ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య వెంకటేష్, ఆచార్య రాజేంద్రప్రసాద్, ఆచార్య శ్రీనివాసకుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంతి అంగన్‌వాడీ టీచర్ మృతి



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: తీర్థం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్‌గా మూడు దశాబ్దాలపాటు సేవలందించి, మూడు సంవత్సరాల క్రితం విశ్రాంతి పొందిన హేమంబిక శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వెంకటరత్న, శకుంతల, అంజలి, తిప్పక్కతో పాటు సిబ్బంది, సహచరులు, స్థానికులు తీర్థం గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. హేమంబిక తన సేవాకాలంలో ఎన్నో కుటుంబాలకు స్ఫూర్తి నిచ్చారని, అనేక మంది చిన్నారులకు విద్యను సమ కూర్చారన్నారు. ఆమె సాదాసీదా జీవనశైలి, కష్ట సుఖాల్లోనూ హుందాతనంతో వ్యవహరించడం గ్రామ ప్రజల్లో మంచి పేరు తెచ్చిందని పలువురు గుర్తు చేసుకున్నారు. తీర్థం గ్రామంలో ఆమె మృతితో విషాద వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది కలిసి కుటుంబాన్ని పరామర్శించారు.

పికేఎం ఉడా ఛైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి-కుప్పం: పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్ మెంట్ ఛైర్మన్‌గా నియమితులైన డాక్టర్ సురేష్ బాబును శుక్రవారం కుప్పం చిరు వ్యాపారులు ఘనంగా సత్కరించారు. కుప్పం ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న డాక్టర్ సురేష్ బాబును పిఎంకె కూడా ఛైర్మన్‌గా నియమించడంపై చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు మంజు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారుల సభ్యులు పెరుమాళ్ స్వామి, బాబు, మతిన్, సురేష్, లాలు పాల్గొ న్నారు.


డాక్టరు సురేష్‌బాబును సన్మానిస్తున్న చిరు వ్యాపారులు

టిటిడి ప్రతిష్టను భ్రష్టు పట్టించారు..

మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- రామకుప్పం: టిటిడిని గత వైసిపి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సిఎం కావడంతో మళ్లీ తిరుమలను ప్రక్షాళన చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నరన్నారు. కోట్లాదిమంది తినే ప్రసాదాన్ని జగన్ రెడ్డి అపవిత్రం చేశాడని, టిటిడి మీద తన సొంత పేపర్, చానాల్లో విష ప్రచారం చేస్తున్నారని, ఒకసారైనా తనకుటుంబం



స్వామి వారికి తలనీలాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. శ్రీవారి టికెట్లను వేలు,లక్ష రూపాయలకు అమ్ము కున్నారన్నారు. స్వామివారి పవిత్రత గురించి వైసిపికి మాట్లాడే అర్హత లేదన్నారు. తిరుమలను ఆదర్శ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా నిలబెట్టడమే లక్ష్యమన్నారు.

కాణిపాక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలమనేరు: ప్రముఖ పుణ్య క్షేత్రం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌తో పాటు ఆలయ అర్చకులు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని వారి స్వగృహంలో శుక్రవారం కలసి ఆహ్వానించారు. ఈనెల 27 నుంచి వచ్చేనెల 16వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు రావాలని కోరారు. వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందించారు. బోయకొండ ఆలయ ఈవో ఏకాంబరం సైతం మర్యాద పూర్వకంగా కలిసి అమ్మవారి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో పూతల పట్టు టీడీపీ సీనియర్ నాయకులు మణినాయుడు, పలమనేరు నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం సాంఘిక సంక్షేమ బాలుల హాస్టల్‌ను ఎంపిడివో పురుషోత్తం సందర్శించి వసతి గృహ రికార్డులు, బాలురకు కల్పించిన సౌకర్యాలను తనిఖీ చేసి, పిల్లలతో మాటా డి వారి చదువులు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. పిల్లలతో కలిసి అల్పాహారం భుజించారు. అంతకు ముందు టికెఎం పురం పంచాయతీలో ఇంటింటికీ చెత్త సేకరణ, పచ్చికాపల్లం పంచాయతీ పరిధిలోని బొమ్మం దొడ్ల వసతి గృహాన్ని తనిఖీ చేశారు.


వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడివో పురుషోత్తం

ఆజాద్ హుస్సేన్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు

ప్రజాశక్తి- శాంతిపురం: స్థానిక మండల పరిధిలోని శ్రీశ్రీపరమహంస యోగా నంద విద్యాలయ ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ చేతుల మీదుగా అందు కున్నారు. 21వ శతాబ్దంలోలి విద్యావ్యవస్థలో అభ్యాసకులను శక్తి వంతం చేయడంలో, దేశంలో విద్యా పరిశ్రమల్లో విద్యా అభివృద్ధి, అవసరా లను, సలహాలు కోసం కృషిచేసిన వాళ్లకు ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రతిష్టాత్మక అవార్డుకు పరమహంస యోగానంద విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ ఎంపికయ్యా రు. హైదరాబాదులోని లినియో కన్వెన్షన్ హాలులో ఈ అవార్డు స్వీకరించారు. ఈ అవార్డు అందుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందని విద్యావ్యవస్థ కోసం నిరంతరం కృషి చేస్తానని వారు తెలిపారు.



వ్యసనాలకు బానిస కావొద్దు

ఐసిటిఎస్ కౌన్సిలర్ బాబు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వ్యసనాలకు బానిస కావొద్దని ఐసిటిఎస్ కౌన్సెలర్ బాబు పేర్కొన్నారు. మండలంలోని తగ్గువారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ యువత దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సూర్య కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ జయచంద్ర, ఆశావర్కర్ భువనేశ్వ రి, పాల్గొన్నారు.

అవగాహనా సదస్సు

పలమనేరు: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ మాదేశ్ బృందం ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో చట్టాలపై, బాల్యవివాహాలు, ఫోక్సో యాక్ట్, డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్, మొబైల్ వాడకం ద్వారా వచ్చే అనర్థాలపై ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్, అడ్వొకేట్ రంజిత్ షా, ఛైర్మన్ మాదేశ్, నేషనల్ కోఆర్డినేటర్ శివశంకర్, నేషనల్ జనరల్ సెక్రటరీ మధుమోహన్ రావు, చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి, పలమనేరు నియోజకవర్గ అధ్యక్షుడు జి క్రియ, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (Senior Division)::Tirupati
O.S.NO. 53/2025

Y. Suresh Babu ...**Plaintiff**

Vs

N. Venkata Ramana ...**Defendant**

Summons to Defendant

D1. Nettalam venkataramana S/o. N.Chenga Reddy, Plot. D.NO 19-9-51/C1, Kennady Nagar, old Tiruchanur Road, Tirupati town, post Tirupati urban mandal and District

whereas the plaintiff has instituted a suit against you. You are here by summoned to appear in the court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accomplained by some other person able to answer all such questions on the date 08.09.2025at 10:30am in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence take summons that in default of you appearance on the day above mentioned the suit will be heard and determined in your absence.

Date of Hearing:-08/09/2025.

G. TIRUMALA REDDDI
Advocate for Plaintiff
9963918447

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE, R.R. DISTRICT AT L.B. NAGAR
O.S. No. 451 OF 2024

BETWEEN:
P. Anjamma & 2 Others ...Plaintiffs

AND

P. Narsing Rao & Others ... Defendants

To,
Pattam Prasanna Kumar, S/o. Subra manyam, R/o. H. No. 18-1-46/2, Prashanti Nagar, K.T. Road, Tirupati-517507 ... Defendant Nos. 24

NOTICE

It is submitted that you are Defendant No. 24 in the above Suit. The Hon'ble Court was pleased to order for the publication of this Notice for your appearance in the above Suit. The matter is posted on **16-09-2025** at **10:30** am. Therefore, you may appear before the Hon'ble Court either in person or through your counsel, failing which the matter will be decided in your absence. Hence, this Notice.

//BY ORDER OF THE HON'BLE COURT//

Regards,

VINOD KETHEPALLY,
Advocate
Flat No-107, Gayatri Nest Apt.,
Telecom Nagar, Gachibowli,
Hyderabad - 500 032.
Cell: 9959 69 0989

IN THE COURT OF ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION):: TIRUPATI
O.S.No.82 of 2024

Sunkari Sagar kumar, rep., by his G.P.A. Holder B. Rama Chandra Reddy, S/o B. Venkata Reddy ... **Plaintiff**

Vs...

M/s. Cherishma Housing Pvt. Ltd., Rep., by Its M.D., Sri C.N. Mallikarjuna Reddy And two others ...**Defendants**

SUIT SUMMONS TO DEFENDANT NOS.1 AND 2 BY WAY OF SUBSTITUTE SERVICE TO D-1. M/s. Cherishma Housing Pvt. Ltd., having its office at 508 A-5th Floor, Chenji Plaza, K.T. Road, Tirupati - 517 501, Tirupati District, Represented by Its Managing Director C.N. Mallikarjuna Reddy.

D-2. Sri. C. N. Mallikarjuna Reddy, S/o C. N. Bheema Reddy, Managing Director of M/s Cherishma Housing Pvt. Ltd. R/o. D.No.512, Reddy & Reddy Colony, Tirupati-517 501, Tirupati District.

Take notice that, the Plaintiff has filed the above suit against you which stands posted to 04-09-2025 for your appearance. Hence you are hereby required to appear before the above named Court on the aforesaid date at 10.30 a.m. onwards either in person or through an advocate and file your objections else, the matter will be decided as exparte.

Hearing Date: 04-09-2025

K. RAMANATHAN,
ADVOCATE, THIRUPATHI

ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో పుంగనూరు

I.A.No. 574/2019
C.F.No. 7582/2018
O.S.No. 27/2016

పిటీషనర్స్ : పి.క్రిష్ణారెడ్డి (Died) మరియు ఇద్దరు
రెస్పాండెంట్స్ : E. నాగమణి మరియు ముగ్గురు

2 నుండి 4 రెస్పాండెంట్స్ కు నోటీసు

2. P. గోవిందమ్మ D/o Late P. క్రిష్ణారెడ్డి W/o జగ్గయ్య మోదలపల్లి విలేజ్ అండ్ పోస్టు, తవనంపల్లి మండలం, చిత్తూరు జిల్లా,
3. పి. జ్యోతమ్మ D/o లేట్ పి. క్రిష్ణారెడ్డి W/o రామేగౌడు ఎర్రినాగపల్లి, వి.కోట పోస్టు మరియు మండలం, చిత్తూరు జిల్లా
4. పి.కుమారి D/o లేట్ పి. క్రిష్ణారెడ్డి W/o చిట్టి బంగారుపాళ్యం గ్రామం, పోస్టు మరియు మండలం, చిత్తూరు జిల్లా

పై తెలిపిన పిటీషన్ పిటీషనర్స్ 2,3 మొదటి పిటిషనర్ అయిన పి. క్రిష్ణారెడ్డి మరణానంతరం మిమ్ములను వారుసులుగా చేర్చుటకు గాను పిటీషను దాఖలు చేసివున్నారు. సదరు పిటీషన్లో మీరు కోర్టు నందు హాజరు అగుటకు పలుమార్లు నోటీసులు జారి చేసినను తీసుకొనక కాలహరణం చేయుచున్నందున శ్రీకోర్టు వారు ఈ పత్రికాముఖంగా నోటీసును జారీ చేయుటకు ఆదేశించినారు. పై తెలిపిన పిటీషను మీ యొక్క హాజరుకుగాను 09-09-2025 తేది పగలు 10.30 గం॥లకు పై కోర్టులో వాయిదా వున్నది. మీరు పై వాయిదాకు హాజరుకానంతట పైన పేర్కొన్న పిటీషన్ మీ పరోక్షములో తీర్మానించబడును.

(By order of Cour)

ఇట్లు

సి.మల్లికార్జునరెడ్డి, B.Sc., LL.B
పి.రామక్రిష్ణ, M.A., LL.B.,
న్యాయవాదులు, చంద్రకాంత్ వీధి, పుంగనూరు.
సెల్:9440752067

అణగారిన వర్గాల గళం 'ప్రజాశక్తి'

ఆదరిద్దాం.. అభివృద్ధికి సహకరిద్దాం.. పూతలపట్టు ఎంఎల్‌ఏ మురళీ మోహన్





ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు, సభలో మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- యాదమరి, చిత్తూరుఅర్బన్: అణగారిన వర్గాలం గళం వినిపించడంలో ఎప్పుడూ ముందుండే ప్రజాశక్తి దినపత్రికను ఆదరించాలని అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని పూతలపట్టు ఎంఎల్‌ఏ డాక్టర్ కలికిరి మురళీమోహన్ పిలుపునిచ్చారు. ప్రజాశక్తి దినపత్రిక 45వ వార్షికొత్సవ సభ శుక్రవారం యాదమరి మండలంలోని శ్రీహరి పంక్షన్‌హాల్‌లో తిరుపతి ఎడిషన్ మేనేజర్ సిఎస్.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఎంఎల్‌ఏ మురళీ మోహన్ మాట్లాడుతూ ప్రతికా రంగంతో తనకున్న అనుభవాన్ని పంచుకుంటూ ఇతర పత్రికలు, ఛానల్స్‌కంటే తనకు ప్రజాశక్తి దినపత్రికతో సుదీర్ఘ అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. ఇతర పత్రికలకు యజమానులుంటే ప్రజల పక్షాన నిలిచే ప్రజాశక్తికి ప్రజలే యజమానులన్నారు. అణగారిన వర్గాలు, పేదలు, కార్మికులు, కర్షకుల గొంతుకై లాభాపేక్ష లేకుండా ప్రజల పక్షాన నిలబడుతున్న ఏకైన పత్రిక ప్రజాశక్తి అంటూ కొనియాడారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఆర్థిక ఇబ్బందుల్లో తట్టుకొని నిలబడ్డం ప్రజాశక్తికే సాధ్యమైందన్నారు. ఈ పత్రికలో పనిచేసే విలేకరులు, సిబ్బంది అత్యంత నిబద్ధతతో పనిచేయడంతో ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల్లో ప్రజాశక్తి అంటే ఓ ప్రత్యేకమైన గౌరవం ఏర్పాటు చేసుకుందన్నారు. ఇలాంటి ప్రతికను ప్రతి ఒక్కరూ ఆదరించాలని పిలుపునిచ్చారు. డెస్క్ ఇన్‌చార్జి వనజ ప్రజాశక్తి ప్రస్తానాన్ని వివరించారు. ప్రతి అక్షరం –ప్రజల పక్షం అంటూ ఏర్పాటు చేసిన ప్రజాశక్తి దినపత్రిక ఎప్పటికీ ప్రజల పక్షాన ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తుందన్నారు. ప్రముఖ సామాజికవేత పార్థసారధి నాయుడు ప్రజాశక్తితో తనకున్న మాట్లాడుతూ అనుబంధాన్ని పంచుకున్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ప్రజాశక్తి దినపత్రిక పేదల, కార్మికులు, ఉద్యోగుల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారిని కృషి చేయడంతో పాటు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను జాగృతులను చేస్తూ పోరాటాలకు ఊపిరిపోస్తోందన్నారు. వివిధ సమస్యలపై ప్రత్యేక సంచికలు తీసుకొచ్చి ప్రజలను చైతన్యవంతం చేయడంతో ఎన్నడూ వెనుకాడలేదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంసృతిక కార్యాక్రమాలు అహుతుల్ని అలరించాయి. వార్షికోత్స సభలో పాల్గొన్న రాజకీయ ప్రముఖులు, ఉద్యోగులు, కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలను ఎంఎల్‌ఏ చేతుల మీదుగా సత్కరించారు. వార్షికోత్సవ సభకు ఉచితంగా పక్షన్‌హాల్ ఇచ్చిన శ్రీహరిని ప్రత్యేకంగా సన్మానించారు. సింగిల్ విండో ఛైర్‌పర్సన్ చిత్రానాయుడు, ఎంపిడిఓ వేణు, ఎస్ఐ ఈశ్వరయ్య, టిడిపి మండల అధ్యక్షులు మురార్జీయాదవ్, ప్రధాన కార్యదర్శి రవి, తహశీల్దార్ పార్థసారధి నాయుడు, టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శి విజయేంద్ర యాదవ్, టిడిపి జిల్లా కార్యదర్శి చిట్టినాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు షకిల, మమత, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, జనవిజ్ఞవేదిక జిల్లా నాయకులు అరుణ శివప్రసాద్, ఉపాధ్యాయ సంఘ నాయులు కనకాచ్చారి, ఏపిఐ సంధ్యారాణి, ప్రజాశక్తి జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసులు, డివిజన్ ఇన్‌చార్జి దాము, విలేకర్లు రాజేష్, బాలు, శంకర్, గురునాధం, హరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు,జెవివి నేత అరుణ శివప్రసాద్, ప్రజాశక్తి మేనేజర్ సిఎస్. ప్రసాద్, బ్యూరో వి.గోపి



పార్థసారధి నాయుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే



రైతు సేవా కేంద్రం ఆవరణలో పడవేసిన మద్యం బాటిళ్లు

మందుబాబులకు అడ్డా రైతుసేవా కేంద్రం

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండ లం మటార్లపల్లి సమీపంలో లక్షలాది రూపా యలు వెచ్చించి నిర్మించిన రైతు సేవా కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారిం ది. కుప్పం – వేపనపల్లి మార్గం లోని మటార్ల పల్లి క్రాస్ వద్ద నిర్మించిన రైతు సేవా కేంద్రం నిరుపయోగంగా వుండడంతో మందు బాబు లకు అడ్డాగా మారిందని స్థానికుల పేర్కొంటున్నారు. చీకటి పడితే మందు బాబులు రైతు సేవా కేంద్రం వద్ద కూర్చొని నానా హంగామా చేస్తున్నారని అధికారులు స్పందించి రైతు సేవా కేంద్రాన్ని వినియోగం లోకి తీసుకురావాలని రైతులు కోరు తున్నారు.

కేసు విచారణకు ఎమ్మెల్యే

ప్రజాశక్తి- యాదమరి: వైసీపీ ప్రభుత్వ పాలనలో బనాయించిన కేసు విచారణకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ శుక్రవారం చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పూతలపట్టు నియోజకవర్గం పరిధిలోని తవణం పల్లెలో చోటుచేసుకున్న ఓ ఘటనపై తవణంపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ విచారణకు ఎమ్మెల్యేతో పాటూ పూతల పట్టు మండల టిడిపి అధ్యక్షులు దొరబాబు చౌదరి, ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్‌పి ధరణీ నాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, తవణంపల్లె మండల మాజీ అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, నాయకులు పట్నం గోపి హాజరయ్యారు.

కుప్పంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యటన



ప్రజాశక్తి-కుప్పం: ఏపీ రాష్ట్ర మహిళా శిశు, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధ పౌరుల శాఖ ప్రధాన కార్యదర్శి సూర్య కుమారి శుక్రవారం కుప్పంలో పర్యటించారు. ఈ సందర్భంగా కుప్పం ఆర్అండ్‌బి అతిథి గృహంలో కడ పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం వారిని కలిశారు. కుప్పం గుడిపల్లి మండలాల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. అక్కడి సమస్యలు తెలుసు కున్నారు. అనంతరం కుప్పం ఏరియా ఆసుపత్రిలో టాటా నర్వ్ సిస్టం పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధికారులతో పాటు టాటా నర్విస్టం ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో ఉడా ఛైర్మన్ సురేష్ బాబు, మాజీ ఎయిమ్స్ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్ సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల దీక్ష విరమణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద డిమాండ్స్ సాధన కోసం 65 రోజులు నుండి మున్సిపల్ కార్మికులు నిరసన దీక్షలు చేస్తూ ఉన్న విషయం తెలిసిందే. మున్సిపల్ కార్మికులు డిమాండ్స్ సాధన కోసం చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 65వ రోజుకు చేరాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వెంకటగిరి మున్సిపల్ కమిషనర్, వెంకట్రామిరెడ్డి, వెంకటగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ, మున్సిపల్ మేనేజర్లు శిబిరం దగ్గరకు వచ్చి కార్మిక నేతలు వడ్డిపల్లి చెంగయ్య, తదితరులతో చర్చలు జరిపారు. పోలేరమ్మ జాతర దృష్టిలో ఉంచుకుని సహకరించాలని దీక్షలు విరమించాలని కోరారు. కార్మికులకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో దీక్షలు విరమించారు. మున్సిపల్ కమిషనర్, సీఐలు మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలను సెప్టెంబర్ నెలాఖరు లోపల పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవి పెంచలయ్య సుబ్బయ్య ప్రసాద్ సుబ్రహ్మణ్యం రమణయ్య శుభ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై చర్యలు తీసుకోండి : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సీటి: టిడిపికి చెందిన ఓ మంత్రి సాక్షాత్తు తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రాసలీలలు నిర్వహిస్తున్నారని, అతనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సిపి చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పద్మావతి పురంలోని ఆయన నివాసం వద్ద కరుణాకర్ రెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తరచూ తిరుపతికి వచ్చే టిడిపి మంత్రి మహిళలను, మహిళ నాయకురాలను పదవులు ఇప్పిస్తానని ఆశ చూపి, రాసలీల కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఒక ప్రతిపక్ష పార్టీ నేతగా తాను ఈ మాట అనడం లేదని, తెలుగుదేశం మంత్రి, తిరుపతిలో ఆయన చేస్తున్న రాసలీలలను గురించి స్వయాన ఆ పార్టీ అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి మీడియా ముఖంగా చెప్పారని గుర్తు చేశారు. ఇలాంటి మంత్రిని చూసి ఆ పార్టీ నాయకులు, ప్రజలు ఛీ కొడుతున్నారు, ఉమ్మేస్తున్నారని తెలిపారు. ఇటువంటి వ్యక్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వయానా తమ పార్టీకి చెందిన మంత్రి తప్పు చేయడంతో, ఏ మాత్రం సంకోసించకుండా దానిని విలువలోకి తెచ్చి ప్రశ్నించిన, ఎన్.బి సుధాకర్ రెడ్డి ని ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి అభినందించారు.

బాబు మాటిచ్చారు.. మోసం చేసారు : వైసీపీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రజలకు అనేక హామీలు మాకు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేశారని వైయస్సార్సీపి తిరుపతి నియోజకవర్గం సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు మోసపూరిత వైఖరికి వ్యతిరేకంగా, తిరుపతిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తిరుపతి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సమాజానికి ఇచ్చిన వాగ్దానాలను అమలు పరచకపోవడం, ముస్లిం ప్రజలపై జరుగుతున్న అన్యాయం బహిర్గతం చేస్తూ ప్రజల ముందు నిజాలు ఉంచి, హక్కుల కోసం గళం ఎత్తాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు సయ్యద్ అబ్దుల్ ఖాదరి, ఇమ్రాన్ భాష, ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

కెకెసి నర్సింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :పుత్తూరు రూరల్,పరమేశ్వర మంగళం, కెకెసి కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరి ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హాజరై విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ సేవాభావంతో నర్సింగ్ వృత్తి నిర్వర్తించాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఝాన్సీరాణి ఆధ్వర్యంలో విద్యార్థులు ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్రతిజ్ఞ చేశారు.

దివ్యాంగుల జాబితా ఇవ్వండి : సిపిఎం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ :ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌లు రీ వెరిఫికేషన్ పేరుతో గూడూరు పరిధిలోని సచివాలయాల్లో 176 పెన్షన్లు తొలగించారు. దీనిపై స్పందించిన సి.పి.ఎం పార్టీ నాయకులు శుక్రవారం గూడూరు పరిధి, సచివాలయాల్లో ఎంత మంది దివ్యాంగులు అర్హులు, ఎంతమంది అనర్హులు సమా చారం ఇవ్వవలసిందిగా మున్సిపల్ మేనేజరు ఎ.మురళిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు సి.పి.ఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ నాయకులు బి.వి. రమణయ్య, పామంజి మణి, అడపాల ప్రసాద్, ఎస్.డి.రఫీ, ఏం బేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల్లో 100 శాతం అడ్మిషన్లు, ఉత్తీర్ణతే లక్ష్యం

- మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి



ప్రజాశక్తి - తిరుపతి సీటీ:సంక్షేమ వసతి గృహాల్లో 100 శాతంఅడ్మిషన్లు, ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రీజనల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహాల తనిఖీలను విధిగా చేపట్టాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సహాయ సంక్షేమ అధికారులను మంత్రి ఆదేశించారు. విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా చూసుకోవాలని వారి అభ్యున్నతికి అధికారులు దోహదపడాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి మాట్లాడుతూ సంక్షేమవసతి గృహాల బాధ్యతలు చేపడుతున్న వారికి ఓరియంటేషన్ ఇవ్వడం ఈ సదస్సు ఉద్దేశమన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనపై విప్లవాత్మక మార్పులు తెచ్చామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ ఎంఎం నాయక్, డైరెక్టర్ లావణ్య వేణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్లు తొలగించొద్దు : సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు: కూటమి ప్రభుత్వం బోగస్ పెన్షన్ల ఏరివేత పేరుతో వికలాంగుల పెన్షన్లను తొలగించరాదని సిపిఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ వికలాంగుల తరపున ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ల మీద ఆధారపడి బతుకుతున్న వికలాంగులను రోడ్డున పడేయటం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఇదే ప్రభుత్వ అధికారులు గతంలో వికలాంగులను పరీక్షించి పెన్షన్లకు అర్హులుగా ప్రకటించారు. కానీ ఇపుడు వారు ఎలా అనర్హులయ్యారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా అర్హులను చిత్తశుద్ధితో పరీక్షించి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగురాలు మురుగమ్మ, చెంగాలమ్మ, రాములమ్మ, ఆది కేశవులు, మురగయ్య, గోవిందయ్య, సిపిఎం మునస్వామి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ పై రాజకీయ ఒత్తిళ్ళా ..!

- నాటకీయ పరిణామాల మధ్య మఠం భవనం కూల్చివేత ప్రక్రియ
- టెండర్ ప్రక్రియకు కలెక్టర్ ఆదేశాలతో తాత్కాలిక బ్రేకులు
- నేడు మఠం భవనాన్ని పరిశీలించనున్న కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం పూర్తిగా శిథిలావస్థకు (కొన్ని ప్రాంతాలలో) చేరడంతో ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం కలుగకుండా కూల్చివేయాలని ఎంపిక చేసిన మఠం మండువా ప్రాంతాలను తొలగించి ఆ స్థానంలో పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించిన మఠం అధికారులకు అడుగడుగునా అడ్డంకులు పడుతూనే ఉన్నాయి. మఠం అధికారులపై ఏ ప్రభుత్వాలు వచ్చినా ఒత్తిళ్లు తప్పవు. ఈ నేపథ్యంలో తిరుపతి నగర పరిధిలోని గాంధీ రోడ్డు మార్గంలో గల శ్రీ స్వామి హథీరాంజీ మఠం పడమర, ఉత్తర దిక్కున ఉన్న మఠం మండువా భవన ప్రాంతం దెబ్బతినింది. కాలానుగుణంగా మఠం మండువ భవనంపై మొక్కలు మొలిచి ఆ గోడ పటిష్టతను దెబ్బతీసాయి. ఉత్తర దిక్కున మండువ ప్రాంగణ ప్రాంతంలో మూడేళ్ల క్రితం ఒరిగిపోవడంతో మఠం అధికారులు


టెండర్ల ప్రక్రియ జరిగే రోజు గాలికి ఊడి పడిపోయిన కిటికీ




దెబ్బతిన్న సీలింగ్

ఇనుప రాడ్లతో తాత్కాలిక మరమ్మత్తులకు అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు మఠం లోపలి భాగాలలో కూడా పెద్ద సంఖ్యలో పెచ్చులు ఊడిపోతుండడంతో మఠంలోని ఓ మాజీ అధికారి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. అటు తర్వాత దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శిథిలావస్థకు చేరిన మఠం మండువా భవనాన్ని కూల్చివేసి పునర్నిర్మించాలని ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో రెండు పర్యాయాలు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో మఠం ద్వారా లీజు ప్రతిపాదికన దుకాణాలు పొందిన వారు రాజకీయ నాయకులను వెంటబెట్టుకొని మఠం కూల్చివేత నిర్ణయాన్ని అడ్డుకుంటూ వచ్చారు.

పలు దఫాలుగా చర్చలు..

తిరుపతి గాంధీరోడ్డు మార్గంలోని శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం కూల్చివేత అంశానికి సంబంధించి పలు దఫాలుగా చర్చలు జరిగాయి. తిరుపతి మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన సమావేశంలో ఆ వార్డు కార్పొరేటర్ దుకాణదారులకు న్యాయం చేయాలని, మఠం మండువా భవనం


బద్దలైన దంతెలు

కూల్చివేస్తే దుకాణదారులు రోడ్డున పడతారని తన వాదన వినిపించారు. అటు తర్వాత ఇటీవల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్లో మఠం అధికారులు, రాజకీయ పక్షాలు, దుకాణదారులు అందరూ కలిసి సమావేశం నిర్వహించుకుని శనివారం మఠం మండువా భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడానికి నిర్ణయం తీసుకున్నారు.

అద్దెబకాయిలు అడిగితే రాజకీయ జోక్యాలు..

శ్రీ స్వామి హథీరాంజీ మఠం ద్వారా లీజ్ ప్రతిపాదికన దుకాణాలు పొందిన వారు మఠం యాజమాన్యానికి చెల్లించాల్సిన అద్దెలు చెల్లించకపోవడంతో గత పది ఏళ్ల నుండి అవి పేరుకుపోయి కోట్ల రూపాయల దాకా చేరిపోయాయి. దుకాణదారులకు మఠం అధికారులు ఎన్ని నోటీసులు అందించినా రాజకీయ ఒత్తిళ్ళతో చేసేదేమీ లేక నిమ్మకుండి పోయే పరిస్థితిని తీసుకొచ్చారు. ఇదంతా క్రమంగా వసూలు జరిగి ఉంటే మఠం మెయింటెనెన్స్ కూడా సక్రమంగా జరిగి ఉండేదని, రాజకీయ పలుకుబడితో వారు కట్టాల్సిన అద్దెలు చెల్లించకపోవడంతో మఠం ఆర్థిక వ్యవస్థ దెబ్బతినిందని నిర్వాహకులు వాపోతున్నారు.



కూల్చివేత, మరమ్మతులపై తిరుపతి ఐఐటి నివేదిక

గాంధీ రోడ్డులోని శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం కూల్చివేతకు సంబంధించి జిల్లా కలెక్టర్ పై కూడా రాజకీయ ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. అధికారికంగా మఠం మండువా భవన పరిస్థితిని ఇటీవల తిరుపతి ఐఐటి పరిశీలించి నివేదికను కూడా ఇచ్చింది. పది జోన్లుగా పరిశీలించిన మండువా భవనంలో కొన్ని ప్రాంతాలకు మరమ్మత్తులు చేసుకోవచ్చని, మరికొన్ని తప్పనిసరిగా కూల్చివేసి తిరిగి నిర్మించుకోవాలని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ రిపోర్టు ఆధారంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి టెండర్ల నిర్వహణ ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టెండర్ల నిర్వహణ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేకులు వేయాలని కలెక్టర్ సూచించారు. మఠం మండువా భవన ప్రాంతాన్ని తాను స్వయంగా పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు.

మఠం భూముల వివరాలను బహిర్గతం చేయాలి..

దేశంలోనే అత్యధిక భూములు కలిగిన శ్రీ స్వామి హథీరాంజీ మఠం పరిపాలన దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో కొనసాగుతోంది. ఇన్నేళ్లుగా మఠానికి చెందిన భూములు ఏ పార్టీలు అధికారంలో ఉంటే వారికి దాసోహం అన్నట్లుగా ఉంది. బంజారా నాయకుల సమాచారం మేరకు ఒకప్పట్లో 16 వేల ఎకరాలు ఉండేదని ఇప్పుడు మఠం భూములు ఎక్కడెక్కడ ఎంత ఉన్నాయి..? అన్న విషయాలను బహిర్గతం చేయాలన్న డిమాండ్ నేడు తెరపైకి వచ్చింది.

పోలూరు జగన్నాధంకు తెలుగుతేజం అవార్డు



ప్రజాశక్తి - వరదయ్యపాలెం: వరదయ్య పాలెంకు చెందిన ఉపాధ్యాయుడు, కవి, జానపద కళాకారుడు పోలూరు జగన్నాధం అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక అందించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన "తెలుగు తేజం" అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ నుండి ఆహ్వానం అందుకున్నారు. ఆగస్టు31వతేదీన పల్నాడు జిల్లా, నరసరావుపేటలో నిర్వహించే తెలుగు భాషా దినోత్సవసంబరాలలో ఈ అవార్డును అందుకోనున్నారు.

దాసరి మునెయ్యకు..



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రముఖ రచయిత, తెలుగు ఉపాధ్యాయులు, సమాజ కవి దాసరి మునెయ్యను తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్య క్షులు కత్తిమండ ప్రతాప్ తెలియజేశారు. కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం పర్యవేక్షణలో దాసరి మునెయ్యకు అవార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మునెయ్యకు అవార్డు రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

పసుపులేటి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



ప్రజాశక్తి - కోట : శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా కోటమ్మ తల్లి దేవస్థాన ప్రాంగణంలో శ్రీ ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, డాక్టర్ దివ్యప్రియ దాతృత్వంతో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా నిర్విరామంగా ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమ నిర్వహించడం ఎంతో అభినందనీయమని, శ్రావణ మాసం చివరి శుక్రవారం పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 300 పైగా భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేసే అదృష్టం కలిగించినందుకు ఆలయ ధర్మకర్త జగన్మోహన్ రెడ్డి దంపతులకు, కార్య నిర్వాహకులు అల్లం రమణయ్య, వారి బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి దాత పసుపులేటి కిషోర్ దంపతులను అభినందిస్తూ వారి కుటుంబ సభ్యులకు కోటమ్మ తల్లి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు.

జయశంకర్ కాలనీలో రోడ్డు మరమ్మతులు


రోడ్డు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి, తిరుమల నగర్ గ్రామపంచాయతీ జయశంకర్ కాలనీ ప్రధాన మార్గంలో తెలుగుగంగ పైపులైను ఏర్పాటు కారణంగా దెబ్బతిన్న రోడ్డుకు మరమత్తు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఏడాది క్రితం తెలుగు గంగ కొనసాగింపు పైపులైను పనులు చేపట్టడంతో రోడ్డును తవ్వి కాంట్రాక్టర్ విడిచి పెట్టేశారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మంగళం డిపో మార్గంలో తెలుగు గంగ గేట్ వాల్ ఛాంబర్ నిర్మాణం జరుగుతుండడంతో స్థానిక టిడిపి నేతలు అడ్డుకొని జయశంకర్ కాలనీ వద్ద రోడ్డు మరమ్మతు పనులు చేసిన తర్వాతే చాంబర్ నిర్మించుకోవాలని అడ్డు చెప్పడం తో కాంట్రాక్టర్ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామపంచాయతీ కార్యదర్శి తలారి చెన్నరా యప్ప, జనార్ధన్, నవీన్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డాలర్స్ దివాకర్ రెడ్డికి ఆహ్వానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగే కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలకు తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డిని ఆహ్వానిస్తూ ఈవో పెంచల కిషోర్ ఆహ్వాన పత్రికను, ప్రసాదాలను అందజేశారు.

వింగ్ టెక్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రేణిగుంట: చైనాకు చెందిన వింగ్ టెక్ యాజ మాన్యంపై చర్యలు తీసుకుని కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం రేణిగుంట సిఐటియు కార్యాలయంలో బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రాంతీయ కమిటీ సమావేశంలో కందారపు మురళి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవాడల్లో పెరుగుతున్న మోసాలు, ప్రమాదాల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో నాటి సీఎం చంద్రబాబు వింగ్ టెక్ యాజ మాన్యానికి అనేక రాయితీలు ఇచ్చి 75 ఎకరాల భూమిని కట్టబెట్టారని, విద్యుత్, పన్ను రాయితీలు ఇచ్చారని తెలిపారు. రూ.1068 కోట్ల పెట్టుబడులు పెడతామని, పదివేల మందికి పైగా ఉపాధి కల్పిస్తామని ఆనాడు వింగ్ టెక్ యాజమాన్యం చెప్పింది, కానీ ఆచరణలో అవేమీ పాటించక, పరిశ్రమను మూసివేత దిశగా నడిపిస్తున్నదని ఆరోపించారు. 2019 తర్వాత 1400 మందికి ఉపాధి కల్పించి1200 మందిని తొలగించారని ప్రస్తుతం 205 మందితో పరిశ్రమను నడుపుతున్నారని, జీఎస్టీ బకాయిలు 250 కోట్ల రూపాయలు పెండింగ్‌లో పెట్టి మరో చైనా సంస్థకు పరిశ్రమను అమ్మకానికి పెట్టారని ఈ బదలాయింపులు జరిగే క్రమంలో పరిశ్రమలో ఉన్న ఆరు కోట్ల రూపాయల విలువైన మొబైల్ పీసులను తరలించ డానికి ప్రయత్నిస్తుండగా కార్మికులు, ఉద్యోగులు అడ్డుకున్నారని కందారపు మురళి గుర్తు చేశారు. పరిశ్రమల యజమానులు, ఆంధ్ర రాష్ట్ర ప్రజలను ఉద్ధరిస్తారని, వారి మాటలు నమ్మి ఎకరాల కొద్దీ భూములు రాయితీలకు అందించి, కోటానుకోట్ల రూపాయల లాభాలను మళ్లించి, ప్రజల సంపదను ఫణంగా పెట్టి, లబ్ది చేకూరుస్తుండగా ఈ



యజమానులు కార్మికుల కష్టాన్ని కొల్లగొట్టి, సంపదను తరలించేసి డ్రామాలాడుతున్నారని, వీరిని ఏమాత్రం క్షమించకుండా కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. వీరు చెల్లించాల్సిన మొత్తాలను ప్రభుత్వం వసూలు చేసుకోవాలని, వాటి ద్వారా కార్మికులకి, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని, పరిశ్రమను 2019లో అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా నడిపి ఉద్యోగాలను పెంచాలని కందారపు మురళి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మోసపూరితంగా వ్యవహరించి ప్రభుత్వాన్ని, కార్మికులను, ప్రజలను మోసగించిన యాజమాన్యంపై కఠినంగా వ్యవహరించాలని కందారపు మురళి డిమాండ్ చేశారు. ఇటీవలి కాలంలో తిరుపతి జిల్లా పరిశ్రమల్లో ప్రమాదాలు పెచ్చరిల్లుతున్నాయని ముఖ్యంగా రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో పలు ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహించకుండా అన్ని పరిశ్రమల్లో భద్రతా వైఫల్యాలపై తనిఖీలు నిర్వహించి కఠినంగా వ్యవహరించాలని కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలని కందారపు మురళి డిమాండ్ చేశారు. రేణిగుంట సిఐటియు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం ఏ.పుల్లయ్య, గురవయ్య, మునిరాజా, హరి, ఓవి రమణ, సెల్వరాజు, ఈశ్వర్, రాజేశ్వరి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, చమర్తి కండ్రిగ గిరిజన కాలనీలోని గిరిజనుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కెవిపిఎస్ నాయకులు దేశాంధి అరుణాచలం, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్‌లు డిమాండ్ చేశారు. 18 వ తేదీ చమర్తి కండ్రిగ గిరిజనులకు తాగునీటి వసతి కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి గ్రీవెన్స్ సెల్లో అర్జీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సిపిఎం నాయకులు చమర్తి కండ్రిగ గిరిజన వాడకు చేరుకొని తాగునీటి వసతుల కల్పన గుర్చి గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో చమర్తి కండ్రిగ గిరిజన వాడకు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దేవిక చేరుకొని సిపిఎం నాయకులతో, స్థానిక గిరిజనులతో మాట్లాడారు. ఇదివరకే లీకేజీ లో ఉన్న నీటి పైపులను పునరుద్ధరించామని, పంపు ఆపరేటర్‌ను నియమించి సక్రమంగా నీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అందుతున్న నీరు అవసరాలకు సరిపోయే విధంగా లేదని అధికారి ఎదుట గిరిజనులు వాపోయారు. బోరు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దేవిక ఈ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించబడేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివచంద్ర, స్థానిక గిరిజనులు శీను, వెంకటేశులు, లక్ష్మయ్య, రాములమ్మ ,సిపిఎం నాయకులు మురళి మునస్వామి,భాస్కర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తుడా పార్కులో గ్రావెల్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి తిరుమల నగర్ గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్ లేఅవుట్ లోని పార్కులో గ్రావెల్ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు పంచాయతీ నిధులతో పార్కు లోపల ఇటీవల శుభ్రం చేశారు. ఉపాధి హామీ నిధు లతో పార్కు చుట్టూ మొక్కలు నాటుతామని, గ్రావెల్ ట్రాక్ భాగాన్ని ఏర్పాటు చేస్తామని, పల్లెవనం పథకం కింద పార్కు లో వాకింగ్ ట్రాక్, సుందరీకరణ చేయడానికి వీలు లేకపోవడంతో దాతలను సంప్రదిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మనోజ్ కుమార్ తెలిపారు. భవిష్యత్తులో దాతలు ముందుకు వచ్చి సుందరీకరణకు నిధులు సమ కూర్చినట్లయితే వాకర్స్‌కు ఎంతో ఉపయోగంగా ఉండనుంది.

తిరుమల ఘాట్‌లో రెండు ప్రమాదాలు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల కొండ పైనుంచి తిరుపతి వస్తున్న కారు ఆర్టీసీ బస్సును ఢీకొంది. మొదటి ఘాట్ రోడ్డులోని 26వ మలుపు దగ్గర శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. బ్రేక్ ఫెయిల్ కావటంతో ఈ ప్రమాదం జరిగిందని కారు డ్రైవర్ వివరించాడు. కారులో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావటంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే.. తిరుమల పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన వారిని తిరుపతి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో కొద్ది సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది ట్రాఫిక్ క్లియర్ చేశారు. మరో ప్రమాదంలో విజయవాడకు చెందిన భక్తులు గాయపడ్డారు. 10మందితో తిరుమల నుండి తిరుగు పయనం అయిన టెంపో ట్రావెలర్ మొదటి మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో కొండను ఢీకొనింది. క్షతగాత్రలును రుయా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టిటిడిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దు : చింతా మోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీటీడీని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం చాలా బాధాకరమని, ఈ సంస్కృతిని వీడనాడాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ సూచించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం కొత్తగా తెచ్చిన బిల్లు ప్రకారం నాయకులు 30 రోజులు జైల్లో ఉంటే పదవిని కోల్పోయేలా రాజ్యాంగ సవరణ చేయడానికి కుట్ర పన్నిందని, ప్రజా ప్రయోజనాల కోసం ప్రజాప్రతినిధులు చేసే పోరాటాలలో ఒక్కోసారి జైలుకు వెళ్లాల్సిన పరిస్థితులు కూడా ఉంటాయని, ఇటువంటివి అడ్డుపెట్టుకొని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా బిల్లు తీసుకువచ్చిందన్నారు. ఈ బిల్లు రావడం వలన మాజీ ముఖ్యమంత్రి జగన్ కు పెద్ద గట్టి దెబ్బ తగులుతుందన్నారు. ఢిల్లీ వెళ్లి వస్తున్న సీఎం చంద్రబాబు రాష్ట్ర అభి వృద్ధికి నిధులు తేలేకపోతున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, రావణ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్, సమీన్ ఉల్లా, యార్లగడ్డ గోపి తదితరులు పాల్గొన్నారు.

25న మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: శుక్రవారం వెంకటగిరి పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో దళిత, గిరిజన, బహుజన, వామపక్ష , ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, ఎమ్మార్పియస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పల్లిపాటి రవి, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు వివి రమణయ్య మాట్లాడుతూ గత సంవత్సరం పోలేరమ్మ జాతరలో దళితుడికిచ్చిన హామీని నెరవేర్చాలని డిమాడ్ చేశారు. ఈ విషయమై 25 తేదీన నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాలు, గిరిజన సంఘాలు, వామపక్ష సంఘాలు, బహుజన సంఘాలు కలిసి, దళిత గిరిజన బహుజన వామపక్ష ఐక్యవేదిక ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారుడు చెంచు కృష్ణయ్య తదితర సంఘాల నాయకులు పాలొన్నారు.

తుడా టవర్స్ ఎత్తు తగ్గించేశారు

- కేంద్ర విమానాయ శాఖ సూచనతో మార్పు
- కొంతమేరకు తగ్గనున్న ఆదాయం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఎంతో ప్రతిష్టా త్మకంగా చేపట్టిన 14 అంతస్తుల తుడా టవర్స్ నిర్మాణం 13 అంతస్తులకు తగ్గింది. కేంద్ర విమానాయ శాఖ తుడా టవర్స్ అంత ఎక్కువ ఉండకూడదని దాని ఎత్తు తగ్గించాలని కోరడంతో తుడా ఉన్నతాధికారులు గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి 13 అంతస్తులు నిర్మాణం జరుగుతోంది. ఇక అంతస్తు తగ్గడంతో తుడాకు ఆదాయం తగ్గే అవకాశాలున్నాయి. టుడే టవర్స్ ఎత్తు ఎక్కువ ఉండడం వల్ల ఆకాశంలో తిరిగే విమానాలకు ఎవరైనా ప్రమాదానికి తలపెట్టే అవకాశం ఉందని కేంద్ర విమానాయా శాఖ అధికారులు సూచించడం ఒక ఎత్తయితే, గోవిందరాజ స్వామి ఆలయం గోపురం కన్నా ఎత్తు పెరుగుతోందని కూడా ఆలోచన చేసి ఎత్తు తగ్గించినట్లు సమాచారం. గోవిందరాజస్వామి ఆలయం గోపురం కన్నా ఎక్కువ ఎత్తు నిర్మాణాలు చేపట్టకూడదని రాష్ట్ర ప్రభుత్వం గతంలో జీవో జారీ చేసి ఉంది. వీటికి దృష్టిలో పెట్టుకుని తుడా టవర్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు తిరుపతిలో హీరో హోండా షోరూం ఎదురుగా వసుంధర నగర్ లో12 అంతస్తుల అపార్ట్మెంట్ మాత్రమే ఉంది. ప్రభుత్వం మారడంతో తుడా టవర్స్ నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. ఎయిర్ బైపాస్ రోడ్డులోని అన్నమయ్య కూడలిని అనుకుని ఉన్న 3.01 ఎకరాల తుడా స్థలంలో రూ.275 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్న వాణిజ, గృహవసరాల భవన నిర్మాణం పనులు చేపట్టారు. తుడా సాధారణ నిధుల నుంచి కోట్లాది రూపాయలు బిల్లులు కాంట్రాక్టరుకు మాత్రమే చెల్లించారు. తుడాలో నిధులు ఖాళీ కావడంతో గుత్తేదారు సంస్థకు చెల్లించాల్సిన బిల్లులు అలస్వం ఆవతుండడంతో ఎన్నికల తరువాత పనులు పూర్తిగా మందగించాయి. తుడాలో విచ్చలవిడిగా నిధులు దుర్వినియోగం జరుగుతోందని, టవర్స్ నిర్మాణంపై అనుమానాలు వ్యక్తం కావడంతో కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తుడా టవర్స్ నిర్మాణం పూర్తి చేయగలిగితే తుడాకు రూ.150 కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉంది. టవర్స్ నిర్మాణం పూర్తి కావాలంటే మరో రూ.200 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ నిధులు సమకూర్చడం ఇప్పట్లో సాధ్యం అయ్యే పనికాదని భావిస్తున్నారు. ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి తుడా అస్తుల తనఖా ద్వారా రూ.50 కోట్ల రుణం తీసుకుని గుత్తేదారుకు చెల్లించి పనులు వేగవంతం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఏడాది రెండుసార్లు ఫ్లాట్లు, వాణిజ్య సముదాయాలు వేలం వేశారు. దీంతో కొంతవరకు నిధులు సమకూరాయి. తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి తుడా టవర్స్ పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నారు. టవర్స్ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు తెలుసుకొని సలహాలు సూచనలు ఇస్తున్నారు.

కేంద్ర విమానయాన శాఖ ఉన్నతాధికారుల సూచన మేరకే టవర్స్ ఎత్తు తగ్గించడం జరిగిందని తుడా ఇంజనీరింగ్ సూపర్డెంట్ కృష్ణారెడ్డి తెలిపారు. నిర్మాణ పనులు చేపట్టకముందే టవర్స్ ఎత్తు తగ్గించి, డిజైన్ తయారుచేసి నిర్మాణ పనులు చేపట్టినట్టు వెల్లడించారు. తుడా టవర్స్ తగ్గింపు వల్ల ఎలాంటి నష్టం లేదని తెలిపారు.

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించండి : ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వినాయక చవితి మండపాల ఏర్పాటు చేసుకునేందుకు తప్పని సరిగా నిర్వహకులు నియమ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. శుక్రవారం అయిన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వినాయక ఉత్సవ కమిటీల పోలీస్ వారి అనుమతి కోసం, రుసుము లేని సింగిల్ విండో విధానం ద్వారా గణేష్ ఉత్సవ లింకును ఓపెన్ చేసి మీ ఫోన్ నెంబర్ ఎంటర్ చేసి ఓటిపి ద్వారా లాగిన్ అవ్వాలని తెలిపారు. లాగిన్ అయిన తరువాత అప్లికేషన్ పూర్తి చేసి సబ్మిట్ చేయాలన్నారు. పోలీస్ వారు ఇచ్చిన వెరిఫై క్యూఆర్ కోడ్ డౌన్ లోడ్ చేసుకొని మండపాల వద్ద అతికించాలని సూచించారు.

మంగళం పిహెచ్సి అభివృద్ధికి కృషి చేస్తాం: ఎంపీపీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి మండలం నుండి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని ఎంపీపీ చంద్రమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మంగళం పరిధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మీటింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు మందులను, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటికి పరిష్కారం మార్గాలు చూపుతామని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ జయంతి ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించుకోవడానికి సమావేశ మందిరం అవసరమని, ఇందుకు సంబంధించిన నిధులను సమకూరిస్తే చాలా ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. సమావేశం మందిరం అనుమతికి చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. హెచ్డి ఎస్ లో ఉన్న నిధులను ప్రాధాన్యత క్రమంలో వినియోగించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీ సర్పంచ్ నాగభూషణమ్మ వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మయ్య, ఎంపీహెచ్ఈఓ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ల తొలగింపు అపోహ మాత్రమే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పెన్షన్లు తొలగింపు అనేది అపోహ మాత్రమేనని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాఎం.ఉమేష్ రావు శుక్రవారం పేర్కొన్నారు. ప్రభుత్వం అర్హుల పెన్షన్లు తొలగిస్తోందని గత కొన్ని రోజులుగా గగ్గోలు పెడుతున్న వైసీపీ పార్టీ నేతల ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవాలేనని కొట్టిపడేశారు. గత వైసిపి ప్రభుత్వంలో నకిలీ సర్టిఫికేట్లతో దివ్యాంగుల పెన్షన్ పొందిన 80 వేల మందికి మాత్రమే నోటీసులు ఇచ్చి విచారిస్తున్నారని, తగిన సర్టిఫికేట్ చూపిస్తే తిరిగి పెన్షన్ పంపిణీ చేయబడుతుందని తెలిపారు. అర్హులకు మాత్రమే పెన్షన్ ఇవ్వాలనేది కూటమి ప్రభుత్వం ఉద్దేశం అని తెలిపారు. మిన్నల్ రవి, బీమాల భాస్కర్ మునిరాజా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ బాబి

ప్రజాశక్తి - నాయుడుపేట: ఆటో డ్రైవర్‌లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నాయుడుపేట పట్టణ సిఐ బాబీ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. పట్టణంలోని రోడ్లపై అడ్డదిడ్డంగా ఆటోలో నుంచి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవనారు. ఆటో స్టాండ్ వద్ద నుండి సీరియల్ ప్రకారం ఆటోలు నడుపుకోవాలని సూచించారు. డ్రెస్ కోడ్ పాటించాలని, లైసెన్స్ కలిగి ఉండాన్నారు. నిబంధనలు పాటించిన వారిపై కేసులను మోదు చేస్తామని తెలియజేశారు.

రైతు సమస్యల పరిష్కారానికే గ్రామసభ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): మండలంలోని చియ్యావరం గ్రామంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సలాల్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చియ్యావరంలో గత ప్రభుత్వంలో భూ సమస్యలపై రైతులు అనేక ఇబ్బందులు ఎదురుకున్నారని, ఈ సమస్యలపై రీ సర్వే నిర్వహించి రైతులు నెలకొన్న భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సలాల్ మాట్లాడుతూ ఈ రీ సర్వేకు ప్రత్యేకంగా కమిటీని బృందాలుగా నియమించి భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డి అరెస్ట్ దుర్మార్గం

ప్రజాశక్తి - సత్యవేడు: లిక్కర్ స్కాం అక్రమ కేసులో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా బయట వస్తారని తిరుపతి జిల్లా సత్యవేడు వైయస్ఆర్సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ నూకతోట రాజేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్‌పై త్వరగా విడుదల కావాలంటూ శుక్రవారం వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మిథున్ రెడ్డికి సంఘీభావం తెలుపుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నూకతోటి రాజేష్ మాట్లాడుతూ లిక్కర్ స్కామును బూచిగా చూపి వైయస్ఆర్సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం సబబు కాదన్నారు. ఇటువంటి చర్యలను ప్రభుత్వం మానుకోవాలని కోరారు. అనంతరం అక్కడినుంచి ప్రదర్శనగా గాంధీ రోడ్డ గుండా గంగమిట్ట వద్దకు చేరుకొని మిథున్ రెడ్డి బెయిల్‌పై త్వరగా బయటకు రావాలని అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో 108 కొబ్బరికాయలు కొట్టి గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన వైద్యశాల ట్రినిటీ

- వైద్యం అంటే సంపాదనే కాదు: డాక్టర్ ఆధవరం సందీప్
- తల్లి పిల్లలకు ఆధునిక వైద్యం
- పేదలకు ఎల్లప్పుడూ అందుబాటులో ట్రినిటీ హాస్పిటల్

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రైవేట్ వైద్యశాలలు డబ్బుకే ప్రాధాన్యత ఇస్తాయనడం అపోహ మాత్రమేనని, అన్నీ అలా ఉండవని నాయుడుపేట, ట్రినిటీ ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. డబ్బున్న వారికే మంచి వైద్యం అందుతుందని, పేదలకు న్యాయం జురుగదనుకోవడం కూడా పొరపాటేనన్నారు. సేవాదృక్పథంతో వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రుల్లో తిరుపతి జిల్లా, నాయుడుపేటలోని ట్రినిటీ ఆసుపత్రి ఒకటని స్పష్టం చేశారు. ట్రినిటీ ఆర్థోపెడిక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించిన అతి తక్కువ కాలంలోనే చెన్నై, తిరుపతి, నెల్లూరు నగరాలకు దీటుగా వైద్య సేవలు అందిస్తూ ప్రజల నమ్మకం చూరగొన్నామని తెలిపారు. పేదలకు ఉత్తమ సేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకున్న ట్రినిటీ హాస్పిటల్ డాక్టర్ ఆదవరం సందీప్ ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా తన అనుభవాలను పంచుకున్నారు. 2014లో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కన ట్రినిటీ వైద్యశాలను ప్రారంభించి, అనతి కాలంలోనే అద్భుతమైన వైద్య సేవలు అందించి, క్లిష్టమైన ఆపరేషన్లు సైతం సునాయాసంగా చేసి ఉత్తమ వైద్యం, తక్కువ ఖర్చుతోనే అందిచామని తెలిపారు. వైద్యానికి సంబంధించిన ఎటువంటి పరీక్షలకు మరోచోటకు వెళ్ళకూడదనే ఆలోచనతో అన్ని సౌకర్యాలతో కూడిన ఒక పెద్ద హాస్పిటల్ నిర్మించి, అందులో ఆర్థోపెడిక్ వైద్యం మాత్రమే కాక ఆయన శ్రీమతి ప్రిడియాట్రిక్ (కాన్పుల,చిన్నపిల్లల వైద్యనిపుణులు) వైద్యంలో 15 ఏళ్ల అనుభవం ఉన్న వైద్యురాలు డాక్టర్ దీప్తి సహకారంతో తల్లి శిశువులకు సంబంధించిన ఆధునిక వైద్యాన్ని కూడా ప్రారంభించామన్నారు. కరోనా సమయంలో కూడా ట్రినిటీలో అందించిన వైద్య సేవలు ప్రజల మన్ననలు చూరగొన్నాయని తెలిపారు. అత్యుత్తమ విలువలు కలిగిన ఉపాధ్యాయుల కుటుంబంలో జన్మించిన ఆయన వైద్య వృత్తిని స్వీకరించి ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు, తిరుపతి వంటి పట్టణాల్లో కూడా అందుబాటులో లేని స్టెమ్ సెల్ థెరపీ (మోకాళ్ళ అరుగుదలకు ఆపరేషన్ లేకుండా చేసే వైద్యం) ట్రినిటీ హాస్పిటల్లో అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. మోకాళ్ళ నొప్పులతో బాధపడే ఎంతో మందికి ఆపరేషన్ లేకుండా చికిత్స చేసి ఉపశయనం కలిగిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ఎన్నో అవార్డులు అందించిందని, వాటిలో




2023, 24 సౌత్ ఇండియన్ మెడికల్ అవార్డు, 2024, 25 గ్లోబల్ హెల్త్ కేర్ అవార్డులు తనకు ఉత్సాహాన్ని ఇచ్చాయన్నారు. తన తండ్రి ఆదవరం నాగూరయ్య ఆదవరం ఫౌండేషన్ స్థాపించి నాయుడుపేట చుట్టుపక్కల పేద ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్, మందులలో కూడా వీలైనంతవరకు రాయితీ కల్పిస్తున్నామన్నారు.

ప్రత్యేక వసతులతో పిల్లలకు ఆధునిక వైద్య సదుపాయాలు

ప్రిడియాట్రిక్ చిన్నపిల్లల వైద్యంలో ఎంతో అనుభవం కలిగిన డాక్టర్ దీప్తితో తన వైద్యశాలలో కాన్పులకు సంబంధించి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పేదవారికి కాన్పులు (ఫ్రీ డెలివరీ అయిన ఆపరేషన్ అయిన) ఉచితంగా అందిస్తున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ వర్తించని వారికి అతి తక్కువ ఖర్చులతో తల్లి పిల్లలకు ఎంతో సౌకర్యమైన వైద్య సేవలు అందిస్తూ తన శ్రీమతి కూడా గొప్ప పేరు గడించారని తెలిపారు. పిల్లల కొరకు ట్రినిటీ హాస్పిటల్‌లో ప్రత్యేక వసతులతో కూడిన ఆధునిక విధానాలతో ఎన్టీఆర్ ఆరోగ్య రక్ష పథకంలో పూర్తిగా ఉచిత వైద్యం అందిస్తున్నామని, పరిసర పట్టణాల్లో లేని ల్యామినార్ విధానాన్ని ట్రినిటీ హాస్పిటల్లో అందుబాటులోకి తెచ్చామని డాక్టర్ దీప్తి తెలిపారు.

టీటీడీకి రూ.50 లక్షలు విరాళం

ప్రజాశక్తి- తిరుమల: ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్‌కు చెందిన ఎక్స్‌ప్రెస్ ఇన్‌ఫ్రా ఎండీ కవిత సింఘానియా శుక్రవారం శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు దాత ప్రతినిధులు జాన్ మని, బొమ్మల మురళీలు తిరుమలలోని అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.



27 నుంచి శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- ఐరాల: ఈనెల 27నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీకాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఆలయ ఈవో పెంచల కిషోర్ ఆహ్వానపత్రిక అందించి సాదరంగా ఆహ్వానించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌ను కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈవో కలిశారు. ఈ సందర్భంగా వేదపండితులు వేద ఆశీర్వచనం పలుకగా ఆలయ ఈవో బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఈనెల 27 నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు నిర్వహించనున్న కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌ను అధికారికంగా ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుటకు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని చేపట్టిన ఏర్పాట్లపై కలెక్టర్‌కు వివరణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామి వారిని దర్శించుకునేలా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి..

- ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలి
- ఎమ్మెల్యేకి అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి -యాదమరి: అంగన్‌వాడీలకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత మంత్రులు, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌కి ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు , యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, బంగారుపాలెం ప్రాజెక్ట్ కార్యదర్శి మమతలు మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోవడంతో 42 రోజులు పోరాటం చేసిన సందర్భంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, గ్రాట్యుటీ పెంచుతామని, పనిభారం తగ్గిస్తామని, వేతనాలు పెంచుతామని హామీలు ఇచ్చి సంవత్సరం పైన అవుతున్నా ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. అన్ని రకాల పనులు చేయిస్తున్నారని, 5 సిమ్‌లు ఇచ్చి ట్యాబులు ఇవ్వాలని పనిచేయని ఫోన్లు తమకు అవసరం లేదని తిరిగి ఇచ్చేస్తే అధికారుల నుంచి ఒత్తిడి తేవడం ఏమిటని ప్రశ్నించారు. యాదమరి మండలం బంగారుపాలెం ప్రాజెక్టుతో పరిధిలోకి వచ్చిందని ప్రాజెక్ట్ ఆఫీసుకి వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని యాదమరి మండలంలోనే క్యాంప్ ఆఫీస్ పెట్టాలని కోరారు. ప్రభుత్వం పరిధిలో ఉన్న సమస్య పరిష్కారం కోసం శాసనసభలో అంగన్వాడీలకు అండగా ఉండాలని స్థానికంగా ఉన్న సమస్యలను స్థానిక అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయాలని కోరారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు. స్థానికంగా ఉన్న సమస్యలపై సోమవారం పీడీతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు జిల్లా ఈగల్ టీం, చిత్తూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, డ్రగ్ నిరోధకంపై వివేకానంద జూనియర్ కాలేజీలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా అవగాహన కల్పించారు. అంతేగాక, డ్రగ్స్ సంబంధిత సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ 1972 ఉపయోగం, అవసరం, గోప్యతకు సంబంధించిన అంశాలపై వివరించారు. అనంతరం 1 టౌన్ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ కృష్ణవేణి సైబర్ నేరాల గురించి వివరిస్తూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు, ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 'గోల్డెన్ హవర్" ప్రాముఖ్యతను తెలియజేస్తూ సైబర్ ఫ్రాడ్ కంప్లైంట్ 1930 గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు, 1టౌన్ పోలీస్ స్టేషన్ హెచ్‌సి గోవిందరాజులు, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ అవకతవకలపై విచారణ

పలమనేరు సబ్ ట్రెజరీ కార్యాలయ ఉద్యోగిపై ఫిర్యాదుతో స్పందన

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు సబ్ ట్రెజరీ ఆఫీసులో ఈ మధ్య ఎక్కువగా వస్తున్న వార్త కథనాలు, ఫిర్యాదులపై జిల్లా అధికారులు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు శాఖా పరమైన విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలు శాఖల నుండి జిల్లా అధికారులకు అందిన ఫిర్యాదు దారులను ఆఫీసుకు పిలిపించుకొని వారి నుండి సమగ్ర సమాచారం రాబట్టారు. ఈ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులను కూడా విచారణ చేపట్టారు. పూర్తి సమగ్ర విచారణను పై అధికారులకు సమర్పించనున్నట్లు విచారణ నిమిత్తం హాజరైన ఏటీవోలు వాసుదేవన్, శ్రీనివాసులు తెలిపారు . ఈ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగిపై పలు ప్రభుత్వ శాఖల నుండి విశ్రాంత ఉద్యోగుల నుండి రాత మూలక ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదు దారులు పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గురు రాజారావు బృందం, మున్సిపల్ శాఖ బృందం పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల మధ్య, కొత్తఎస్‌టిఓ మధ్య సమన్వయం లేకపోవడంతో కార్యాలయం గుట్టు రట్టయినట్లుగా పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా తమ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులను సమన్వయంతో పనిచేసేలా అదుపులో పెట్టుకోవాల్సిన బాధ్యత కొత్త ఎస్‌టిఓపై వుందని పలువురు పేర్కొంటున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు మండలంలోని సముద్రపల్లి గ్రామంలోని పరాగ్ మిల్క్ ఫుడ్స్ లిమిటెడ్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై శిక్షణ ఏర్పాటు చేశారు. 2025 ఆగస్టు 20 నుండి 22 వరకు కొనసాగిన ఈ శిక్షణలో బేసిక్ ఫైర్ ప్రివెన్షన్, ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ పద్ధతులపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరాగ్ డెయిరీ ఉద్యోగులు 25 మంది, మేనేజర్లు రెడ్డి ప్రసాద్, సేఫ్టీ మేనేజర్ ఫణిదీప్, సుదర్శనం, లీలాకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విపత్తు నిర్వహణ, జల్లా అగ్ని మాపక అధికారి సి పెద్దిరెడ్డి, జి బాలరాజు, జిల్లా విపత్తు నిర్వహణ, అగ్ని మాపక అధికారి, ఏపీ ఎఫ్ఎస్, సిడిఐటి, సత్తెనపల్లి, పలనాడు జిల్లాల వారు పర్యవేక్షించారు. శిక్షణలో పలమనేరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. మనోగరణ్, పుంగనూరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్ సుబ్బరాజు, ఎం. రెడ్డిప్ప రెడ్డి, సి సుమస్, లీడింగ్ ఫైర్మెన్, పలమనేర్ ఎస్. శివరాజ్, ఫైర్మెన్, పలమనేర్, ఉన్న పరాగ్ డెయిరీ సిబ్బందికి సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ద్వారా ఉద్యోగులకు అగ్ని ప్రమాదాల నివారణ, ప్రథమ చికిత్స, రక్షణ పద్ధతులు , ప్రాథమిక అగ్ని మాపక విధానాలు, పారిశ్రామిక భద్రతా ప్రమాణాల విలు వలపై అవగాహన కల్పించారు.

వేరుశనగ పంట తస్కరిస్తున్న వ్యక్తులపై ఫిర్యాదు



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి రెవెన్యూ పరిధిలో కామినాయన పల్లి గ్రామానికి చెందిన మునెప్ప (విశ్రాంత ఉపాధ్యాయుడు) కు సర్వే నెంబర్554/3 లో భూమి వుంది. ఈ భూమిలో ప్రస్తుతం వేరుశనగ పంట విత్తి సాగు చేయడంతో, కోతకు సిద్ధంగా వేరుశనగ కాయలున్నాయి. యజమాని లేని సమయంలో ఒక రోజంతా ముగ్గురు వ్యక్తులు (వివిధ గ్రామాలకు చెందిన వారు వేరుశనగ కాయలను ఒబ్బిడి చేస్తుండగా తస్కరించడానికి ప్రయత్నించారు. ఈ సమాచారాన్ని చుట్టుపక్కల రైతులు గమనించి భూమి యజానికి తెలిపారు. ఆయన తన పొలం వద్దకి వెళ్లి, పరిశీలించగా తన్నరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించగా అప్పటికే ఒబ్బిడి చేసిన వేరుశనగ కాయలను బస్తాలోకి నింపి తీసుకెళ్లారు. దీన్ని గమనించిన సమాచారాన్ని మెటనే భూ యజమాని మునెప్ప బైరెడ్డిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలం చేరుకోగా ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు వ్యక్తులు అస్థలంలోనే ఉన్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. కానీ ముగ్గురు ఎంత సమయానికి రాకపోవడంతో ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వినోదం, విజ్ఞానం అందించేవి జానపదాలు

ప్రజాశక్తి-తవణంపల్లి: వినోదం, విజ్ఞానం అందించేవి జానపదాలు అని పలువురు పేర్కొన్నారు. తవణంపల్లి మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో జానపద దినోత్సవం సందర్భంగా జానపద పాటల మాసోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో తవణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జానపద పాటలపై అవగాహన కల్పించారు. మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డప్ప జానపద పాటల పై కళల రూపంలో విద్యార్థులను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు జానపద కళల పైన అభిరుచులు కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం జానపదాలు పైన మండల జిల్లా రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమాన్నిచేపడుతున్నామని కళలు పైన ప్రతి ఒక్కరూ ఆసక్తి కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి హేమలత మాట్లాడుతూ జానపద పాటలు కళలను ప్రోత్సహించాలని, ఒక జాతి నిర్మాణానికి అవసరమైన ఆకారాలు జానపదకళలు అందిస్తా యని, ఇలాంటి సంస్కృతి వాతావరణాన్ని విద్యార్థులు తెలుసుకొని కాపాడు కోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జానపద ప్రదర్శన కళలకు తెలుగు భూమి పండిన పంట పొలం వంటిదని శతాబ్దాలుగా ప్రజలకు వినోదాన్ని విజ్ఞానాన్ని అందించినవి జానపదాలేనని తెలిపారు. తవణంపల్లి ఎన్జీవో అనంత కుమార్ మాట్లాడుతూ పల్లెటూరు వారు పాడుకునే పాటలు జానపద గీతాలని నేటికీ ఇవి అంతరించిపోకుండా ఈ కళలను కాపాడుకునే బాధ్యత సమాజం పైన విద్యార్థుల పైన అందరి పైన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు పూల మనోహర్, పూసల నరసింహులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శునకాలు పట్టివేత

ప్రజాశక్తి -విజయపురం నగరి : మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటం, ఇటీవల జిల్లాలో చిన్నారిపై కుక్కలదాడి సంఘటనలు చోటు చేసుకోవడం, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతినాయుడు సభ్యులతో పాటు వెళ్లి కమిషనర్ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేయడం వంటి సంఘటనలపై మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాల్లో కుక్కల వేట ప్రారంభించారు. కుక్కలు పట్టడంలో ప్రత్యేక శిక్షణ పొందినవారిని రప్పించి కుక్కలను పట్టి తిరుపతి అనిమల్ కేర్‌లాండ్‌కు తరలించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం తెలిపారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శంకరాచారికి పరామర్శ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బంగారుపాళ్యం పర్యటన సందర్భంగా మండలంలోని పెద్ద చల్లారగుంట గ్రామానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త శంకరాచారిని పోలీసులు అరెస్టు చేశారు. పలమనేరు నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు శంకరాచారి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పలమనేరు నియోజకవర్గం వైసిపి యువత అధ్యక్షులు ఈ చంద్రశేఖర్ రెడ్డితో పాటు ప్రముఖ నాయకులు ఆర్‌వి సుబ్రహ్మణ్యం, కిషోర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వి కోట సుబ్రహ్మణ్యం, అమరనాథరెడ్డి తదితరులు శంకరాచారి వద్దకు చేరుకున్నారు. నాయకులు శంకరాచారికి ధైర్యం చెప్పి 'భయపడకండి.. పార్టీ కార్యకర్తలకు వెన్నంటి మేముంటాం.. ఇది అన్యాయం, కానీ న్యాయం తప్పక సాధిస్తాం" అని భరోసా ఇచ్చారు. తనను పరామర్శించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ "ఇంత కష్టసమయంలోనూ ఇంటికి వచ్చి యోగక్షేమాలు అడిగి ధైర్యం చెప్పినందుకు నాయకులందరికీ పేరుపేరునా శంకరాచారి ధన్యవాదాలు తెలిపారు.

కేబుల్ వైరు చోరీ

కొత్త వైరు తెచ్చి బోరు కనెక్షన్ ఇచ్చిన సిబ్బంది



ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీఓ కార్యాలయంలోని సిబ్బందికి నీటి సౌకర్యం కోసం కార్యాలయ ప్రాంగణంలో ఉన్న బోరుకు బిగించిన మోటారుకు సంబంధించిన కేబుల్ వైర్ కేబుల్ వైరు చోరీకి గురి కావడంతో గుర్తించిన కార్యాలయ సిబ్బంది శుక్రవారం నూతన వైరు తీసుకువచ్చి కనెక్షన్ ఇచ్చి మోటారు నడిచే విధంగా చేశారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాదాపు 160 అడుగుల పొడవైన బోరు కేబుల్ వైర్ కత్తరించుకు వెళ్లారు. శుక్రవారం ఉదయం గుర్తించిన సిబ్బంది అధికారులకు తెలిపి నూతన వైరును తీసుకువచ్చి బిగించి కార్యాలయానికి నీటి సమస్య లేకుండా సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సందీప్, కృష్ణయ్య, శ్రీనివాసులురెడ్డి, సయ్యద్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలోనే తహశీల్దారు కార్యాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, హౌసింగ్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, ఉపాధి కార్యాలయం, సబ్ సెంటర్, బాలుర వసతి గృహం, దిద్దివారిపల్లి సచివాలయం ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం సచివాలయం కార్యాలయంలోని సిబ్బంది నీటి కోసం ఏర్పాటు చేసిన భూగర్భ ట్యాంకులో ఉన్న మోటారు, కేబులు దొంగలు దొంగలించుకు పోవడంతో చేసేదేమీ లేక పంచాయతీ వారు నూతన మోటారు కేబులు తెచ్చి బిగించారు. మరి కొద్ది రోజులకు ఇరికిపెంట సచివాలయంలోనూ చోరీకి యత్నించారు. అయితే అక్కడ దొంగలకు ఏమి దొరకకపోవడంతో రికార్డులన్నీ చిందరవందర చేసి వెళ్లారు. కార్యాలయాల సముదాయాల వద్ద చిమ్మ చీకటిగా ఉండడం మొక్కుబడిగా ఉన్న రెండు సోలార్ లైట్లు తప్ప కార్యాలయాల వద్ద గాని, ఎక్కడా వెలుతురు లేకపోవడంతో దొంగలకు సౌకర్యంగా ఉంటోంది. ఇకనైనా ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద కాంతివంతమైన దీపాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు జర్మన్ భాష శిక్షణ అందిస్తాం

■ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: బి.ఎస్.సి, జి ఎన్ ఎం కోర్సులు చేసిన పేద విద్యార్థుల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా జర్మనిలో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, వెనుకబడిన ఓ బి.సి పేద విద్యార్థులకు కూడా జర్మన్ బాషా శిక్షణ అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బాబు జగజ్జీవన్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, నైపున్యాభివృద్ధి శాఖ ఈ.డి మధుసూదన్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్లతో కలసి అంబేద్కర్, బాబు జగ్జీవన్ చిత్రపటాలకు పూల మాలవేసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ నర్సులకు జర్మన్ భాషా శిక్షణ, నియామక కార్యక్రమం మొదటగా మూడు ప్రదేశాలలో గుంటూరు, విశాఖపట్నం, తిరుపతిలలో మొదలు పెడదామని అనుకున్నామని, తర్వాత దానిని 5 ప్రదేశాలలో పెంచాలని ఆలోచనతో, తర్వాత కర్నూలు కాకినాడ లలోని మెడికల్ కాలేజీలలో ఏర్పాటు చేశామన్నారు. జర్మన్ భాష పై శిక్షణ ఇచ్చే ఏజెన్సీ వారు ముందుకు వస్తే 26 జిల్లాలకు కూడా విస్తరింప చేయాలనే ఆలోచనలో ఉన్నామని అన్నారు. జర్మనీ భాష పై నర్సింగ్ విద్యార్థులు పట్టు పెంచుకోవాలని, తెలుగు భాష వలె జర్మనీ భాషని కూడా రాస్తూ, అనుక్షణం చదువుతూ దానిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మీరందరూ ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే మీ కుటుంబాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలంటే ఆదాయ వనరులు పుష్కలంగా ఉండే జర్మనీ లాంటి దేశాలకు వెళ్లి డబ్బును సంపాదించి, మీ కుటుంబ అభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. మీరందరూ సమయం వృధా చేయకుండా భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని అందుకు అహర్నిశలు శ్రమించాలని తెలిపారు. ప్రభుత్వం కూడా సహాయ సహకారాలు అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ రోజు న ప్రభుత్వం చదువుకునే పిల్లలకు ఎక్సలెన్స్ పేరున 10 సెంటర్లను పెట్టి ఐఐటి నీట్ లాంటి పరీక్షలకు కోచింగ్ ఉచితంగా అందిస్తోందని అన్నారు. నీట్ పరీక్ష తప్పిన విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ ను అందించేందుకు ఎస్సీలు 60 మందికి ఎస్టీలు 20 మందికి కలిపి మొత్తం 80 మందికి కోచింగ్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్క కుటుంబం కూడా ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో పి- 4 ను ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టారని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌ను మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రం తరపున ప్రధాని ప్రోత్సహిస్తూ సహకారం అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన బియ్యం అందిస్తున్నామని, మధ్యాహ్న భోజనంలో కూడా నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసి వివిధ పనులు చేసుకుంటున్న వారికి కూడా జర్మనీ భాష నేర్పించి జర్మనీ వెళ్లి ఉద్యోగం చేసుకునేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ప్రతి పేద బడుగు వర్గాల వారి ఇళ్లలో వెలుగు చూసేలా విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించే ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ముఖ్యమంత్రి గారి ఆలోచన దృష్ట్యా ముందుకు వెళుతున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందినటువంటి విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఎస్సి, ఎస్టీ నర్సులకు జర్మన్ భాషా శిక్షణ, నియామక కార్యక్రమం ఒక వినూత్నమైన కార్యక్రమమని మన రాష్ట్రంలో జాబ్ మేళాలు ద్వారా కొంతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించే దిశగా సీఎం చర్యలు తీసుకుంటున్నారని ఆ మేరకు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన చేసిన మొదటి సంతకం డీఎస్సీ నియామకం అన్నారు. డి ఎస్ సి రాత పరీక్ష ఇటీవలే పూర్తయినదని, నియామకాలు కూడా చేపడుతున్నారని అన్నారు. త్వరలో అలాట్మెంట్ కూడా జరుగుతుందని తెలిపారు. మన దగ్గర ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలే కాకుండా మరొక అడుగు ముందుకు వేసి ఈరోజు వెల్ఫేర్ మరియు స్కిల్ డెవలప్మెంట్ శాఖలు కలిసి మన ఎస్సీ ఎస్టీ పిల్లలని ఇంకా ఉన్నతమైన స్థానాలకు తీసుకెళ్లాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని రెండు ప్రదేశాలైన విజయవాడ, గుంటూరులలో విజయవంతంగా నడుపుతున్నారని అన్నారు. తిరుపతిలో కూడా సుమారుగా రాయలసీమ జిల్లాలలో ఉన్నటువంటి బిఎస్సి నర్సింగ్ జిఎన్ఎమ్ కోర్సులు చేసినటువంటి విద్యార్థులకు ప్రభుత్వం జర్మన్ భాషలో ఉచితంగా శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నదని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఏదైతే ఏ1, ఏ2, బి1, బి2 పరీక్షలు అన్నీ కూడా జాగ్రత్తగా రాసుకున్నట్లయితే వీసా తో పాటు ఉపాధి అవకాశం కూడా కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ సహాయ సహకారాలు లేకుండా ఉద్యోగ అవకాశం పొందాలంటే ఎగ్జామ్ ఫీజు, వీసా ఖర్చులు అన్నీ కలుపుకొని సుమారు 13 లక్షల దాకా ఖర్చు అవుతుందని, సాధా రణంగా శిక్షణ ఇవ్వడానికి ప్రైవేట్ సంస్థలు 75 వేల దాకా చార్జ్ చేస్తారని ఆ బాధ్యత అంతా కూడా ప్రభుత్వం తీసుకుని బీఎస్సీ నర్సింగ్, జిఎన్ ఎమ్ పూర్తి చేసిన 52 మందిని అప్రూవల్ చేసిందని వారందరూ కూడా చక్కగా శిక్షణ పొంది జర్మనీలో ఉద్యోగ అవకాశం పొందేలా చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. భారతదేశ జనాభా లో 25 నుండి 35 సంవత్సరాల వయసు ఉన్నవారు చాలా ఎక్కువగా ఉన్నారని వెస్ట్రన్ దేశాలతో పోలిస్తే అక్కడ వయసు పైబడిన వారు ఎక్కువ మంది ఉన్నారని కాబట్టి ఇతర దేశాలలో ఉపాధి అవకాశాలు చాలా ఎక్కువగా ఉండడంతో వాటిని అందిపుచ్చుకోవడం కోసం మన రాష్ట్రం నర్సింగ్ లో మాత్రమే కాకుండా వివిధ విభాగాలలో యువతకు శిక్షణ అందిస్తూ విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రోత్సహిస్తుందని అన్నారు. మన దేశంతో పోలిస్తే ఇతర దేశాలలో ఆదాయ వనరులు ఎక్కువ కనుక తలసరి ఆదాయం పెరిగే అవకాశం ఉన్నదని అన్నారు. కావున ప్రతి ఒక్కరు భయపడకుండా దృఢ నిశ్చయంతో స్కిల్స్ పెంపొందించుకునీ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తిరుపతి ఎం.ఎల్ ఏ అరిని శ్రీనివాసులు మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్రాన్ని ముందుకు తీసుకు రావడానికి ఆహర్నిశలు కష్టపడుతుందన్నారు. ఎస్సీ ఎస్టీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమాన్న తిరుపతిలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం ఎం నాయక్ మాట్లాడుతూ కొత్త భాష నేర్చుకోవడం వల్ల జ్ఞాపకశక్తి ఆత్మస్థైర్యం మెంటల్ ఎబిలిటీ పరిజ్ఞానం పెంపొందించుకోవడంతోపాటు తెలివితేటలు అభివృద్ధి చెంది అలాగే జర్మన్ లో నర్సింగ్ కొత్త విధానంలో ముందుకెళ్తూ అవకాశాలు అందిపుచ్చుకోవడానికి మన ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ విద్యార్థులకు సువర్ణ అవకాశంగా తెలియజేశారు. సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ బి. లావణ్య వేణి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రత్యేక చొరవ తీసుకొని నర్సింగ్ పూర్తి చేసినటువంటి మహిళలు కు, జర్మన్ లో ఉపాధి అవకాశాలను పెంపొందించుకొని వారి జీవన విధానంలో ఆర్థికంగా, సాంఘికంగా, సృజనాత్మకత, పెంపొందించుకుని ,ఎదగడానికి ఈ కార్యక్రమం మంచిగా దోహదపడుతుందని తెలియజేశారు. ఏపీ ఎస్ ఎస్ డి సి ఎండి తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం నలువైపుల నుండి నర్సింగ్ చేసిన విద్యార్థులకు జర్మన్ భాష పై ఆరు నెలలు శిక్షణ ఇచ్చి మరియు వారికి జర్మన్ దేశంలో ఉద్యోగ కోసం కల్పించడానికి రాష్ట్రం నందు పలుచోట్ల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారికి జర్మన్ భాష పై పట్టు సాధించడానికి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఏ1, ఏ2, బి1, బి2 లెవెల్ లో అర్హత సాధించడానికి అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లు కుమారి , బాబు , సోషల్ వెల్ఫేర్ డి.డి.విక్రమ్ కుమార్ రెడ్డి, డి టి డబ్ల్యూ, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ రాజు సోము, చంద్రిక, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది, నాయకులు ప్రజాప్రతినిధులు, ఏపీ ఎస్ఎస్డిసి సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - కోట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ సర్వేతో గ్రామంలో దశాబ్దాల నుండి ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని కోట తహశీల్దార్ కటారి జయ జయ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని రుద్రవరం, చెందోడు, గూడలి గ్రామాల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొట్టమొదటి సారిగా చేపడుతున్న భూ సర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కటారి జయ జయ రావు మాట్లాడుతూ రెవెన్యూలో రైతులకు పలు సమస్యలు ఉంటాయని నేపథ్యంలో వాటి పరిష్కారానికి ఈ భూ సర్వే ఎంతో ఉపయోగం పడుతుందన్నారు. రైతులందరూ సర్వే టీంలు కొలతలు వేసే రోజు పొలాలకు వెళ్లి తమ వద్ద ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు, లింక్ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ స్టాంపులు అధికారులకు చూపించాలన్నారు. ఎన్నో ఏళ్ల నుండి భూ సర్వే లేక రైతు భూములు రికార్డులో నమోదు కాక పోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరిత గతిన సర్వే పూర్తి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కటారి జయ జయ రావు, ఆర్ ఐ ప్రసాద్,మండల సర్వేయర్ గోపిరెడ్డి, వి ఆర్ ఓ లు,, స్థానిక గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో క్యామెల్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్. ఐ.వి, ఎయిడ్స్, డ్రగ్స్ డీ అడిక్షన్ పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ సుహాసిని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెచ్. ఐ.వి, ఎయిడ్స్ పై అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యామెల్ సిబ్బంది చాంద్ బాషా , సురేష్, భారతి, సునీత, మాధురి, ఇందు, పాఠశాల సిబ్బంది భారతి, భాస్కర్ , సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరును జిల్లాగా చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలని గూడూరు నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ను కలిసి అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోరికను సీఎం, డిప్యూటీ సీఎంలకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో పవన్, దశరథ రామిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బాలకృష్ణం రాజు, చంద్ర మోహన్, శివ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల సమస్యలు పరిష్కరిస్తాం

: ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టిడ్కో అపార్ట్మెంట్ నివాసాల వద్ద పలు సమస్యలు స్థానికులు తెలియజేశారని వాటిని పరిష్కరిస్తామని ముందుగా అపార్ట్మెంట్ చుట్టూ పెరిగిపోయిన చెట్లను తొలగించే కార్యక్రమం చేపడతామని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. పట్టణ సమీపంలోని టిడ్కో అపార్ట్మెంట్లను ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. అపార్ట్మెంట్ వాసులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ కిషోర్ బాబు, శ్రీనివాసులు, ఎస్సై మనోజ్ కుమార్, నాయకులు కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య , శివకుమార్, రహీం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం పరిధి, చిందూరు గిరిజన కాలనీలోని అంగన్వాడీ పాఠశాలలో బాల్య వివాహాల పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ హైమవతి మాట్లాడుతూ బాలికలను చదివించడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్షయ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చంద్ర మౌళి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్షయ వ్యాధిని తగ్గించడం, పేద బలహీన వర్గాల ఆరోగ్య రక్షణ పైన దృష్టి సారించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కే.శ్రీనివాసులు, వి. బాబూరావు, డాక్టర్ వి.వాసవి, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలో జరిగిన "సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్" వర్క్‌షాప్‌లో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులలో సైబర్ అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించారు. డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ వర్చువల్ ప్రపంచంలో డేటా ప్రాముఖ్యత పెరుగుతున్న ఈ రోజుల్లో, సైబర్ హ్యాకింగ్ నుండి రక్షణ పొందడం అత్యంత కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఐటీ రంగ నిపుణులు అర్జున్, ప్రసాద్ రెడ్డి, అవినాష్, శ్యాం, రవి సాగర్, ధనుష్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించండి

ప్రజాశక్తి - ఏర్పేడు: ఏర్పేడు మండలం, యండి పుత్తూరులో తొలగించిన వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని సర్పంచ్ మోహనప్రియ ఏర్పేడు ఎంపీడీవో సౌభాగ్యమ్మకు వికలాంగులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మా గ్రామ పంచాయతీనందు నలుగురికి వికలాంగుల పింఛన్లను తొలగించారని వాటిని పునఃపరిశీలించి పునరుద్ధరించాలని కోరారు.

నేడు ప్రేరణ హెల్పింగ్ సొసైటీ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజంలో ఉన్న వికలాంగ పౌరులకు, వారిలో ఉన్న టాలెంట్‌ను సమాజానికి పరిచయం చేసే ప్రేరణ హెల్పింగ్ సొసైటీ 18వ వార్షికోత్సవాన్ని శనివారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు సొసైటీ నిర్వాహకులు ఆకాష్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగులను గుర్తించి వారికి నైపుణ్యాన్ని సమాజానికి పరిచయం చేయడానికి ఎన్జీవోల ద్వారా కృషి చేస్తున్నామన్నారు. గడచిన 18 సంవత్సరాలుగా విద్యార్థులుగా తాము ఈ ఒక్క సేవ నిమిత్తమై వికలాంగులకు కావలసిన మెడికల్ కిట్లు, ఇతర ఉపయోగకరమైన వస్తువులను వారికి అందిస్తూ వస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ వార్షికోత్సవ వేడుకకు మహిళా డీఎస్పీ శ్రీలతతో పాటుగా ఎంతోమంది ఎన్జీవోలు హాజరవుతున్నారన్నారు.

ఘనంగా సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మెగాస్టార్ చిరంజీవి, 70వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పుత్తూరు చిరంజీవి అభిమానులు ఆలయాల్లో అర్చనలు చేయించారు. దివ్యాంగుల పాఠశాలలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మెగాస్టార్ చిరంజీవి అభిమాను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కేవీబీపురం: చిరంజీవి అభిమానులు నత్తం మాధవ్, కన్నయ్యల ఆధ్వర్యంలో శుక్రవారం కేవిబి పురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి రజిని, ఎంపిహెచ్ఓ రవిచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు చంద్రన్న ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి- వరదయ్య పాలెం: అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలానికి చెందిన 4284 మంది రైతులకు అన్నదాత సుఖీభవ తొలి విడత నగదు క్రింద రూ.2.94 కోట్లు మెగా చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ముస్లిమ్ పాలెం, లక్ష్మీపురం గ్రామాలలో కాంక్రీట్ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమమే నా లక్ష్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పాత్రికేయుల సంక్షేమానికి తాను కట్టుబడి ఉన్నానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. గుర్తుంపు పొందిన పాత్రికేయులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున గౌరవ వేతనాలు అందేలా అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రాంత పాత్రికేయులపై ఎమ్మెల్యే వరాల జల్లును కురిపించారు. ఎన్నికల హామీల్లో భాగంగా పాత్రికేయుల కుటుంబానికి ప్రమాద బీమా పాలసీని 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలోనే ప్రారంభించారు. మూడు నెలల్లోపు ప్రెస్ క్లబ్‌కు స్థలాన్ని సమీకరించి శాశ్వత భవనాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు. అర్హత కలిగి ఉండీ ఇప్పటి వరకు ఇంటి స్థలాలు పొందని పాత్రికేయులకు త్వరలోనే పట్టాలతో కూడిన ఇంటి స్థలాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అర్హత ఉన్న పాత్రికేయుల పిల్లలకు ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇప్పించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కందేరి కార్తీక్ నాయుడు తదితర సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో విఎస్‌యు అఫిలియేషన్ బృందం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విఎస్‌యు అఫిలియేషన్ బృందం శుక్రవారం పర్యటించారు. డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ మణికంఠ యూనివర్సిటీ ప్రతినిధులుగా కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వివిధ సదుపాయాలు, అకడమిక్ గ్రూపులకు సంబంధించిన పరిశీలన చేసి సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శివప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకులందరూ సక్రమంగా తమ విధులు నిర్వహిస్తున్నారని, ఎంతోమంది రైతులు, స్వర్గీయ సన్నపరెడ్డి కృష్ణారెడ్డి సహాయ సహకారాలతో ప్రారంభింపబడిన కళాశాల ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఎన్.సి.సి. కోఆర్డినేటర్ మైమూన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్ అంధుల క్రీడలకు పుత్తూరువాసి ఎంపిక

జాతీయ స్థాయిలో అంధత్వ పరీక్ష బాధ్యతలు నిర్వహించనున్న బాలాజీ



ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : పారా ఒలింపిక్ జాతీయ అంధుల క్రీడాకారుల అంధత్వ శాతం పరీక్ష నిర్వహణ బాధ్యతలకు పుత్తూరుకు చెందిన కోటకొండ బాలాజీని పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా ఎంపిక చేసింది. ఈ నెల 29 నుండి 31 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ అటల్ బిహారీ వాజ్‌పేయి స్టేడియంలో ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో వివిధ రాష్ట్రాల అంధుల క్రీడాకారులు పాల్గొననున్నారు. వీరి అంధత్వ శాతం పరీక్షించడానికి మెడికల్ క్లాసిఫైయర్గా బాలాజీ వ్యవహరిస్తారు. ఈ పరీక్షలు తంబ్లింగ్ చార్ట్ పద్ధతిలో నిర్వహించబడతాయి. కోటకొండ బాలాజీ తిరుపతి ఎస్.వి. మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రీ అండ్ అసిస్టెంట్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన పుత్తూరులోని అన్న గౌరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఆప్టోమెట్రిస్ట్‌గా పనిచేస్తున్నారు. స్థానికంగా ఈ ఎంపికపై ఆనందం వ్యక్తమవుతోంది. జాతీయ స్థాయిలో అంధుల క్రీడలకు పుత్తూరువాసి కీలకంగా బాధ్యతలు నిర్వర్తించనుండడం గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

అవినీతికి పాల్పడ్డ ఎస్వీయు ఈసీ మెంబర్లను కొనసాగించడం తగదు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇటీవల అకడమిక్ కన్సల్టెంట్ ల నియామకానికి సంబంధించిన దస్త్రంపై తనకు పూర్తిస్థాయి అవగాహన లేకుండా సమ్మతి తెలిపానని వర్సిటీ పాలకమండలి సభ్యురాలు వి.జ్యోతి చెప్పడం సిగ్గుచేటని కూటమి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి(భాజపా), హిమవంత్(జనసేన), హేమంత్ రాయల్(టీఎన్ఎస్ఎఫ్) పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె వర్సిటీ ఉపకులపతికి లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైకాపా ప్రభుత్వంలో విద్యారంగం పట్ల, ఉన్నత విద్య పట్ల ఏమాత్రం అవగాహన లేని వ్యక్తులను రాజకీయ ప్రయోజనాల కోసం విశ్వవిద్యాలయాలకు ఈసీ మెంబర్లుగా నియమించారని, దాని ప్రతిఫలమే నేడు జ్యోతి వ్యాఖ్యలకు నిదర్శనమని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినప్పటికీ నేటికీ అక్రమ మార్గంలో నియమితులైన, విద్యా వ్యవస్థ పట్ల అవగాహన లేని ఈసీ మెంబర్లను తక్షణం తొలగించాలన్నారు. విశ్వవిద్యాలయ ప్రగతికి, అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలకు ముందుగా సమ్మతి తెలిపి.., ఆపై వైకాపా అధిష్టానం ఒత్తిడితో లేఖలు రాస్తున్న ఈసీ మెంబర్ల పట్ల కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వారిని తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. వైకాపా ప్రభుత్వంలో 2019లో చట్ట విరుద్ధంగా ఇంటర్వ్యూలు నిర్వహించి బడుగు బలహీన వర్గాలకు చెందిన ఉద్యోగులను ఆనాటి పాలకులు తొలగించారన్నారు. కానీ ప్రస్తుతం వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన 110 జీవో ప్రకారమే పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి ముందుకెళ్తున్నప్పటికీ వైకాపా ప్రభుత్వంచే నియమితులైన ఈసీ మెంబర్లు ఆ పార్టీ అజెండా మేరకు పనిచేస్తూ వర్సిటీల ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ఎస్వీయూ పాలకమండలి సభ్యురాలు జ్యోతి రాసిన రాతపూర్వక లేఖను తీవ్రంగా పరిగణించి ఆమెపై కఠిన చర్యలు తీసుకొని, పదవి నుంచి తొలగించాలన్నారు. వైకాపా ప్రభుత్వ ఆధ్వర్యంలో నియమితులైన అన్ని వర్సిటీల పాలకమండలి సభ్యులను తక్షణం తొలగించాలని, వారు చేసిన అవినీతి, అక్రమ సిఫార్సులపై విజిలెన్స్ విచారణ నిర్వహించాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు.

భక్తుల నుండి అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవు

: ఆర్టీవో మురళీమోహన్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 24వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని, ఈ బ్రహ్మోత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల నుండి అధిక చార్జీల వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. శుక్రవారం మంగళంలోని రవాణా శాఖ కార్యాలయంలో పోలీసు అధికారులు, టిటిడి విజిలెన్స్ అధికారులతో కలిసి ప్రైవేటు వాహనాల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి మాట్లాడుతూ తిరుమలలో యాత్రికులకు మీరే మార్గ నిర్దేశకులుగా ఉండాలని, యాత్రికుల పట్ల సద్భావంతో మెలగాలని అన్నారు. తిరుమల ట్రాఫిక్ సిఐ హరి ప్రసాద్ మాట్లాడుతూ నిర్దేశించిన పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలను నిలుపుకోవాలని, లేదంటే జరిమానాలు తప్పవన్నారు. తిరుపతి ట్రాఫిక్ సిఐ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ అధిక ట్రాఫిక్ రద్దీ కారణంగా ట్రాఫిక్ నియమ నిబంధనలు, వన్ వే, రహదారి నిబంధనలను అతిక్రమణ చేయకుండా నడుచుకోవాలన్నారు. అలిపిరి ఏవీఎస్ఓ రమేష్ మాట్లాడుతూ తిరుమలకు వెళ్లి అన్ని వాహనాలకు విధిగా ఫాస్ట్ ట్యాగ్ ఉండాలని, ఆగస్టు 15 నుండి ఈ నిబంధనను టీటీడీ అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు వనం వెంకటసుబ్రహ్మణ్యం, అతికానాజ్, దామోదర్ నాయుడు, జిల్లా ఎన్ఫోర్స్మెంట్ వాహన తనిఖీ అధికారులు మోహన్ కుమార్, రమణ నాయక్, ఆంజనేయ ప్రసాద్, తిరుమల మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి ప్రత్యేక యోగా



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గల శ్రీ వెంకట పెరుమాళ్ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం కోసం యోగా, ధ్యానం ప్రత్యేక క్లాస్‌ను శుక్రవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమం లో యోగా నిపుణులు సుబ్రమణ్యం, ధ్యాన గురువు తిరుమలరాజు మార్గనిర్దేశం చేశారు. విద్యార్థుల్లో స్ట్రెస్ తగ్గించి, ఏకాగ్రత పెంచుకోవడానికి యోగా, ధ్యానం ఎంతగానో సహాయపడతాయని నిపుణులు పేర్కొన్నారు. రోజూ కనీసం అరగంట యోగా, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని నిపుణుల సూచనలతో వివిధ ఆసనాలు, ధ్యాన పద్ధతులను ప్రాక్టీస్ చేశారు. చివరగా కాలేజ్ ప్రతినిధులు నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి - రేణిగుంట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుత్తి వారి పల్లిలో శుక్రవారం తిరుపతి జిల్లా తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిని ఇందిరా దేవి, మండల విద్యాశాఖ అధికారి రంగనాథయ్య చేతుల మీదుగా ఇద్దరు పేద విద్యార్థులకు సైకిల్స్, నాణ్యమైన వాటర్ బాటిల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు తక్షణమే పరిష్కారం

ప్రజాశక్తి - కోట: విశ్వనాథపురం అగ్రహారంలో ప్రజలు గత కొంతకాలంగా విద్యుత్ సమస్యతో బాధపడుతుండేవారు. ఈ నేపథ్యంలో స్థానిక గ్రామస్తులు విద్యుత్ సమస్యను, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది. తక్షణమే వారు స్పందించి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి 24 గంటల విద్యుత్తు అందించేందుకు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు భూమి పూజ నిర్వహించారు. దీంతో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్, నీటి సంఘం అధ్యక్షులు నెల్లూరు మోహన్ రెడ్డిలకు విశ్వనాథపురం అగ్రహారం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

జానపద విజ్ఞానాన్ని కాపాడుకుందాం



ప్రజాశక్తి - క్యాంపస్ : దేశంలో మరుగునపడుతున్న జానపద విజ్ఞానాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎస్వీయూ ఇంచార్జ్ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు పేర్కొన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద విజ్ఞాన దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జానపద కళలను ప్రదర్శించిన విద్యార్థులందరినీ వీసీ అప్పారావు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు సర్టిఫికెట్లు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వయ్యారిభామ మొక్కపై అవగాహన



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో సాగులో ప్రధాన కలుపు మొక్క అయిన వయ్యారిభామ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డాక్టర్ ఎంవి రమణ మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు ఈ వయ్యారి భామ కలుపు మొక్కపై అవగాహన పెంచుకొని వారి సమీప ప్రాంతాలతో పాటు వారి వారి గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చేతి విజ్ఞాన విభాగపు అధిపతి డాక్టర్ వి.చంద్రిక, ప్రొఫెసర్లు డాక్టర్ డి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఏవి. నాగవాణి, డాక్టర్ రెడ్డిరాము, డాక్టర్ జి.మోహన్ నాయుడు, పీజీ, పీహెచ్డీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని దళిత గిరిజన సమస్యలు వారి అభివృద్ధి అంశాలపై మండల దళిత సంఘ నాయకులు శుక్రవారం ఎస్సై బాలకృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. దళిత సంఘ నాయకులు ఎస్ఐతో మాట్లాడుతూ మండలంలోని బడుగు బలహీన వర్గాలపై వస్తున్న భూ సమస్యలు, క్రిమినల్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ మొదలైన అంశాలపై చర్చించారు. దళితుల సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసులు, పులిచెర్ల మహేష్, పాటూరు రెడ్డప్ప, విశ్వనాథ, బీసీ నాయకులు మాలేరెడ్డప్ప, హరి, అంజి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

30న అండర్ 17 ఫెన్సింగ్ పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, వెస్ట్ బెర్రి స్కూల్‌లో జరగబోయే 11వ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-17 బాలుర, బాలికల ఫెన్సింగ్ చాంపియన్షిప్-2025-26 నకు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫెన్సింగ్ టీం ఎంపికలు 24-ఆగస్టు 2025 ఆదివారం సాయంత్రం 3:00 గంటల నుండి ఫెన్సింగ్ ట్రైనింగ్ సెంటర్, శ్రీదేవి కాంప్లెక్స్ తిలక్ రోడ్డు, తిరుపతి నందు జరుగుతాయని ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు 31.12.2025 నాటికి 17 సంవత్సరాల వయస్సు ఉన్న ఫెన్సర్లు ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి అర్హులు. 01 జనవరి 2009న లేదా ఆ తర్వాత మరియు 31 డిసెంబర్ 2012న లేదా ఆ ముందు జన్మించి ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి గుర్తింపు కార్డు కలిగి వ్యక్తిగత ఫెన్సింగ్ క్రీడా పరికరాలు తొ హాజరు కావాలని మరిన్ని వివరములకు జిల్లా ఇంచార్జీ పి గీత ని 9573144231 నెంబర్ లో సంప్రదించాలని జిల్లా కార్యదర్శి వైయస్ దిలీపు కుమార్ తెలిపారు.

జానపద కళాకారులకు సన్మానం



ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా బలరామరెడ్డి మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో తాతయ్యగుంట గంగమ్మ గుడిలో పంబు కళాకారులకు సన్మానం చేశారు. ఎస్వీయూ టీచర్స్ సంఘం మాజీ అధ్యక్షులు ఆచార్య పుట్టా మునిరత్నంరెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి జానపద విజ్ఞానం పట్టుకొమ్మ అన్నారు. జానపద సాహిత్యం, సంగీతం, నృత్యం నుంచి నేటి శిష్ట సాహిత్యం, కళలు ఆవిర్భవించాయన్నారు. ఎపి తెలుగు అకాడమీ ఫౌండర్ డైరెక్టర్ ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తిరుపతి గంగమ్మకు వందల సంవత్సరాల నుంచి పంబల వాయిస్తూ, గంగమ్మ కథను పాడే పంబల వాద్యగాళ్ళ కుటుంబానికి చెందిన మోహన్, కిరూర్ కుమార్ లు అభినందనీయులన్నారు. ప్రపంచ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఈ పంబ కళాకారులను సన్మానించడం మన బాధ్యతన్నారు. బలరామరెడ్డి మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు ఎస్వీయూ పూర్వ వైస్ -ఛాన్సలర్ ఆచార్య పి.జయరామరెడ్డి ఈ సొసైటీ తరపున ప్రతి సంవత్సరం ఇదేరోజు జానపద కళాకారులను సన్మానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓఏ జయకుమార్, ఎస్. హరీష్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ పింఛన్ల మంజూరు

నోటీసులను వెనక్కు తీసుకోవాలి: శోభన్ బాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సదరం పునఃపరిశీలనలో 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన వారికి తాత్కాలిక సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరిగిందని, వీరికి ఆపేయనున్న పింఛన్లను సెప్టెంబర్ 1న యధాతథంగా పంపిణీ చేయబడుతుందని, నోటీసులను వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం గ్రామ వార్డు సచివాలయాలలో సంబంధిత సంక్షేమ కార్యదర్శిలు నోటీసులను వెనక్కి తీసుకోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వికలాంగులు తాము అర్హులం అని భావిస్తే ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో నోటీసు అందిన 30 రోజులలోపు అప్పీల్ చేసుకోవచ్చున్నారు.